

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 10 సంచిక : 69 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 11 నవంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :69 PAGES :8 | EDITOR : G. A. RAO (ANANT GANTYADA) | PUBLISHED : KAKINADA | WED 11 NOVEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





ఏపీ వైపు మరో అల్పపీడనం..
దక్షిణ కోస్తా,
రాయలసీమకు వర్షసూచన

- ఈనెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం
- 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం
- దక్షిణ కోస్తా రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- నవంబర్ 14 మరియు 15 తేదీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- తెలంగాణలో క్రమంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

- మిగతా 2లో

ఏపీపీఎస్సీ గ్రూప్-2 సమగ్ర నోటిఫికేషన్ విడుదల..
పెరిగిన పోస్టులు

- ఏపీలో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల
- గతంలో ప్రకటించిన 686 పోస్టులను 720కి పైగా పెంచిన ఏపీపీఎస్సీ
- డిసెంబర్ 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- 2027 ఫిబ్రవరి 21న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ
- ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకునే అవకాశం



- మిగతా 2లో

ఏపీలో భారీ పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్..

రూ.31 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్!





- ఏపీ కేబినెట్ నిర్ణయాలు.. పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్
- భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్ ఆమోదముద్ర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ (ఆఎ+జ-శ=) పాలసీ 2026-31, ఏపీ రోబోటిక్స్ - ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో

- మిగతా 2లో

జనవరిలో సహకార ఎన్నికలు



అమరావతి: విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా దాదాపు రూ.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలు జరగనున్నాయని, తద్వారా 11 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

- మిగతా 2లో



పవన్ కల్యాణ్ వ్యక్తిగత వ్యవహారంపై
టీడీపీ, వైసీపీ ప్రకటన..
పార్టీ కేడర్లకు కీలక ఆదేశాలు!

- పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల విడిపోతున్నట్లు అధికారిక ప్రకటన
- ఇది తమ వ్యక్తిగత విషయమని, గోప్యతకు గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తి
- ఈ అంశంపై స్పందించవద్దని కేడర్‌కు ఐటీడీపీ ఆదేశం
- వ్యక్తిగత విమర్శలు చేయొద్దంటూ వైసీపీ కూడా ప్రకటన
- రాజకీయాల్లో హుందాతనాన్ని ప్రదర్శించిన ప్రధాన పార్టీలు

- మిగతా 2లో

రిటైర్మెంట్ వరకు ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్
పాడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

- సంజయ్ సస్పెన్షన్‌ను మరోసారి పాడిగించిన ఏపీ ప్రభుత్వం
- రిటైర్మెంట్ తేదీ 2027 మార్చి 31 వరకు లేదా విచారణ పూర్తయ్యే వరకు వేటు కొనసాగింపు
- మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్



- మిగతా 2లో



గాలిని కాదు.. విషాన్ని పీలుస్తున్న జనం!

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో మోగుతున్న ప్రమాద ఘంటికలు!

దీపావళి తర్వాత మరింత తీవ్రమైన వాయు కాలుష్యం.. అత్యంత కలుషిత ప్రాంతాల్లో లోనీ.. పారిశ్రామిక ఉద్గారాలు, వాహనాల పొగ, నిర్మాణ ధూళితో ప్రజారోగ్యానికి పెనుముప్పు!

దీపావళి పండుగ సంబరాలు ముగిసినప్పటికీ ఉత్తర భారతదేశాన్ని వాయు కాలుష్య భూతం వదలడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడమే కష్టంగా మారింది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోని ఉత్తరప్రదేశ్‌లోని లోనీ ప్రాంతంలో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. దీపావళి అనంతరం ఢిల్లీ--జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో అత్యధిక కాలుష్య ప్రభావానికి గురైన ప్రాంతాల్లో లోనీ ఒకటిగా నిలిచింది. గత 12 నెలల కాలంలో లోనిలో సగటు పీఎం2.5 సూక్ష్మ ధూళి కణాల సాంద్రత ఒక క్యూబిక్ మీటరు గాలికి 112.5 మైక్రోగ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన వార్షిక మార్గదర్శక పరిమితి 5 మైక్రోగ్రాములతో పోలిస్తే ఇది దాదాపు 22 రెట్లు అధికం. స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థ ఐక్యూఎయిర్ వార్షిక కాలుష్య ర్యాంకింగ్స్‌లోనూ లోనీ ప్రపంచంలోని అత్యంత కలుషిత ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

కాలుష్య సంక్షోభానికి పది ప్రధాన కారణాలు : లోనిలో వాయు నాణ్యత ఇంతగా దిగజారడానికి దీపావళి వేడుకలే ఏకైక కారణం కాదు. పారిశ్రామిక కార్యకలాపాలు, వాహనాల రాకపోకలు, పర్యావరణ పరిస్థితులు, ప్రతికూల వాతావరణ మార్పులు కలిసి కాలుష్య తీవ్రతను పెంచుతున్నాయి.

1. పారిశ్రామిక ఉద్గారాలు: లోనీ పరిసరాల్లోని పరిశ్రమలు, చిన్న తరహా తయారీ కేంద్రాల నుంచి వెలువడే పొగ, విషపూరిత వాయువులు గాలిని కలుషితం చేస్తున్నాయి. ముఖ్యంగా లోహాలను కరిగించే కొలిమిల నుంచి వెలువడే హానికర ఉద్గారాలు వాయు నాణ్యతను మరింత దిగజారుస్తున్నాయి.

2. రహదారులపై దుమ్ము: అధ్వానంగా ఉన్న రహదారులు, దెబ్బతిన్న రహదారి ఉపరితలాలు, దుమ్ము నియంత్రణ చర్యలు సరిగా లేకపోవడంతో పెద్దఎత్తున ధూళి గాలిలో కలుస్తోంది. చలికాలంలో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతోంది.

3. నిర్మాణ కార్యకలాపాలు: నివాస భవనాలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు నిరంతరం కొనసాగుతుండటంతో తవ్వకాలు, నిర్మాణ సామగ్రి నిర్వహణ ద్వారా భారీగా ధూళి వెలువడుతోంది. ఇది కాలుష్యాన్ని మరింత పెంచుతోంది.

4. భారీ వాహనాల రాకపోకలు: ఢిల్లీ, ఘజియాబాద్, బాఘ్‌పత్ ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారుల్లో వాహనాల రద్దీ అధికంగా ఉంది. ముఖ్యంగా ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే, ఢిల్లీ--డెహ్రాడూన్ జాతీయ రహదారులపై భారీ ట్రక్కుల రాకపోకలతో వెలువడే పొగ కాలుష్యానికి ప్రధాన కారణంగా మారుతోంది.

5. బహిరంగ ప్రదేశాల్లో చెత్త దహనం: జనాభా పెరుగుదలతో పాటు వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. గృహ, పారిశ్రామిక వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో తగలబెట్టడం ద్వారా విషపూరిత పొగ, హానికరమైన సూక్ష్మ ధూళి కణాలు వాతావరణంలోకి చేరుతున్నాయి.

6. ఇటుక బట్టీలు: బాఘ్‌పత్ పరిసరాల్లోని ఇటుక బట్టీల నుంచి వెలువడే పొగ, హానికర ఉద్గారాలు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఇటుకల తయారీ కోసం మట్టి తవ్వకాలు, ముడిసరుకు రవాణా వల్ల కూడా పెద్దఎత్తున ధూళి వ్యాపిస్తోంది.

7. పంట వ్యర్థాల దహనం: శీతాకాలం ప్రారంభంలో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంట అవశేషాలను తగలబెడుతున్నారు. ఈ మంటల నుంచి వెలువడే పొగ గాలుల ద్వారా ఇతర ప్రాంతాలకు వ్యాపించి ఢిల్లీ--ఎన్‌సీఆర్‌తో పాటు లోనీ ప్రాంతాన్నీ ప్రభావితం చేస్తోంది.

8. ప్రతికూల వాతావరణ పరిస్థితులు: చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, వాతావరణంలో తేమ పెరగడం, గాలి వేగం తగ్గడం వల్ల కాలుష్య కారకాలు సులభంగా చెదరిపోవడం లేదు. ఫలితంగా విషపూరిత కణాలు భూమికి సమీపంలోనే నిలిచిపోయి కాలుష్య తీవ్రతను పెంచుతున్నాయి.

9. రసాయనిక చర్యలు: సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, అమ్మోనియా వంటి వాయువులు వాతావరణంలోని ఇతర కాలుష్య కారకాలతో రసాయనిక చర్యలకు లోనై ద్వితీయ సూక్ష్మ ధూళి కణాలను ఏర్పరుస్తాయి. ఇవి ప్రమాదకరమైన పీఎం2.5 కణాల సాంద్రతను మరింత పెంచుతున్నాయి.

10.ఢిల్లీ-ఎన్‌సీఆర్ కాలుష్య ప్రభావం: ఢిల్లీ, ఘజియాబాద్, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, పారిశ్రామిక ఉద్గారాలు, భారీ నిర్మాణ కార్యకలాపాల ప్రభావం లోనీపై కూడా పడుతోంది. కాలుష్యానికి ప్రాంతీయ సరిహద్దులు ఉండవని, ఒక ప్రాంతంలో వెలువడే కాలుష్యం మరో ప్రాంతాన్నీ ప్రభావితం చేస్తుందని ఈ పరిస్థితి స్పష్టం చేస్తోంది.

ఢిల్లీలోనూ ప్రమాదకర స్థాయికి చేరిన వాయు నాణ్యత : దేశ రాజధాని ఢిల్లీలోనూ పరిస్థితి ఏమాత్రం మెరుగ్గా లేదు. అధికారిక గణాంకాల ప్రకారం ఉదయం 8.10 గంటల సమయంలో ఢిల్లీ గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ--AQI) 483కు చేరుకుంది. ఇది అత్యంత తీవ్రమైన కాలుష్య స్థాయి. మరోవైపు ఐక్యూఎయిర్ వంటి ప్రైవేటు వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థలు షాదారా, దక్షిణ ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీ వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ 1,000 దాటినట్లు వెల్లడించాయి. వివిధ ప్రాంతాల్లో నమోదవుతున్న ఈ గణాంకాలు రాజధానిలో కాలుష్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తున్నాయి.

ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పీఎం2.5 కణాలు : గాలిలో పెరుగుతున్న పీఎం2.5 సూక్ష్మ ధూళి కణాలు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయి. ఈ అతి సూక్ష్మ కణాలు శ్వాసకోశ వ్యవస్థలోకి లోతుగా ప్రవేశించి ఊపిరితిత్తులను చేరడమే కాకుండా రక్తప్రవాహంలోకి కూడా ప్రవేశించే ప్రమాదం ఉంది. దీనివల్ల శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాలుష్య గాలిని దీర్ఘకాలం పీల్చడం వల్ల గుండె జబ్బులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, ఇప్పటికే శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. కాలుష్యం తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లడం తగ్గించడం, బహిరంగ ప్రదేశాల్లో కఠినమైన శారీరక శ్రమకు దూరంగా ఉండటం, ఆరోగ్య శాఖ సూచనలు పాటించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

దీపావళి ఒక్కటే కారణం కాదు.. దీర్ఘకాలిక పర్యావరణ సంక్షోభం! : దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల కొద్ది గంటల్లోనే వాయు కాలుష్యం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, లోనీతో పాటు ఢిల్లీ--ఎన్‌సీఆర్ ప్రాంతంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితికి పండుగ వేడుకలే ఏకైక కారణం కాదు. పారిశ్రామిక ఉద్గారాలు, వాహనాల పొగ, నిర్మాణ ధూళి, బహిరంగ చెత్త దహనం, పంట వ్యర్థాల కాల్చివేత, ప్రతికూల వాతావరణ పరిస్థితులు కలిసి ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. రోజురోజుకూ దిగజారుతున్న గాలి నాణ్యత ప్రస్తుత కాలుష్య నియంత్రణ చర్యల సమర్థతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రభుత్వాల సంసిద్ధతపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, పరిశ్రమలపై నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ, రహదారులపై దుమ్ము నియంత్రణ, పొరుగు రాష్ట్రాల మధ్య సమన్వయంతో కూడిన కార్యాచరణ తక్షణ అవసరంగా మారింది.తాత్కాలిక ఆంక్షలు, కాలానుగుణ అత్యవసర చర్యలతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. కాలుష్యానికి మూలకారణాలను గుర్తించి వాటిని నిర్మూలించేలా ప్రభుత్వాలు సమగ్ర దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి. స్వచ్ఛమైన గాలి విలాసం కాదు.. ప్రతి మనిషి జీవించే హక్కులో అంతర్భాగం. ఇప్పటికైనా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు చేపట్టకపోతే ఢిల్లీ--ఎన్‌సీఆర్ ప్రజలు పర్యావరణ నిర్లక్ష్యానికి రానున్న రోజుల్లోనూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది

వెళ్లిపోయిన ఎమ్మార్వో మళ్లీ ఎందుకొచ్చారు?

- తహసీల్దార్ సునీల్ కుమార్ పునర్నియామకం ఎవరికోసం ?
- ఎమ్మెల్యే చొరవతోనే తిరిగి వచ్చారన్న ప్రచారంలో నిజమెంత?
- అదే స్థానానికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వాల్సిన అవసరం ఎందుకొచ్చింది ?
- ఎంపీటీసీ ఎన్నికల తర్వాత తహసీల్దార్‌పై సంచలన ఆరోపణలు
- పరిమి రవికుమార్ ఆరోపణలతో రాజకీయ వర్గాల్లో చర్చ
- బదిలీ, పునర్నియామక ఉత్తర్వులను వెల్లడించాలనే ప్రశ్న తెరపైకి
- రెవెన్యూ వ్యవస్థలో రాజకీయ జోక్యంపై పలు అనుమానాలు

స్టేట్ బ్యూరో పెన్ పవర్ తాడేపల్లిగూడెం, నవంబర్ 10:
ప్రజలకు సేవలందించాల్సిన రెవెన్యూ వ్యవస్థలో ఒక అధికారి నియామకం ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారింది. తాడేపల్లిగూడెం తహసీల్దార్ సునీల్ కుమార్ గతంలో ఇక్కడి నుంచి బదిలీ అయి, తిరిగి అదే స్థానానికి రావడం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.?. వెళ్లిపోయిన అధికారిని మళ్లీ తీసుకురావాల్సిన అవసరమేమిటి? ఇది పరిపాలనాపరమైన నిర్ణయమా? లేక రాజకీయ సిఫార్సుల ప్రభావమా? అన్న అంశాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.ఇటీవల వెంకటరామన్నగూడెం ఎంపీటీసీ ఎన్నికల అనంతరం

ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఓటమికి సొంత పార్టీ నాయకులతో పాటు తహసీల్దార్ వ్యవహారశైలి కూడా కారణమని టీడీపీ అభ్యర్థి పరిమి రవికుమార్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలపై విచారణ జరిపించాలని, సంబంధిత కాల్ రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు.

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సిఫార్సుతోనే సునీల్ కుమార్ తిరిగి వచ్చారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.? ప్రజాప్రతినిధులు అధికారుల నియామకాలపై సిఫార్సులు చేయడం తప్పు కానప్పటికీ, అటువంటి నియామకాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరిగాయా అన్నది ముఖ్యం. అసలు సునీల్ కుమార్‌ను గతంలో గూడెం నుంచి ఎందుకు బదిలీ చేశారు? తిరిగి అదే స్థానానికి ఎవరి ప్రతిపాదనతో నియమించారు? పునర్నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్న కారణాలేమిటి? ఈ ప్రశ్నలకు రెవెన్యూ ఉన్నతాధికారులే స్పష్టత ఇవ్వాల్సిన అవసరముంది. భూముల రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ భూముల

పరిరక్షణ వంటి కీలక బాధ్యతలు నిర్వహించే తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు జరగాలి. పలుకుబడి ఉన్నవారితో పాటు సామాన్య ప్రజల వినతులకూ సమాన ప్రాధాన్యం దక్కాలి. ఒక అధికారి ఎవరి సిఫార్సుతో వచ్చారన్నదానికంటే, ఆయన ఎవరి కోసం పనిచేస్తున్నారు? చట్టం ప్రకారమా? రాజకీయ ప్రభావంతోనా? అన్నదే ప్రధాన ప్రశ్న. బదిలీ ఉత్తర్వులు, అధికారిక రికార్డులు, సంబంధిత వ్యక్తుల వివరణలతోనే వాస్తవాలు తేలాలి. తహసీల్దార్ నియామకంపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే. పారదర్శకమైన వివరణతోనే ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టగలరు.

ఎపిసోడ్--2

తహసీల్దార్ కార్యాలయంలో నిజంగా ఒత్తిళ్లు ఉన్నాయా?
కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిళ్ల ప్రచారం..
అధికారుల స్వతంత్ర నిర్ణయాల్లో జోక్యం ఉందా?

ఏపీలో భారీ పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్..

- మొదటి పేజీ తరువాయి

రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

వ్యక్తిగత విమర్శలు వద్దు!

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన అర్ధాంగి అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించడం తెలిసిందే. తాము పరస్పర అంగీకారంతో, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. తమ పిల్లల పట్ల బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా కొనసాగుతామని, స్నేహితులుగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సున్నితమైన సమయంలో తమ వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని వారు కోరారు.పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఈ పరిణామంపై అధికార కూటమిలో భాగమైన తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం ఐటీడీపీ (ఐఐఐ) స్పందించింది. ఎవరి వ్యక్తిగత జీవితంపైనా స్పందించవద్దని పేర్కొంది. కూటమి పార్టీల నేతలతో పాటు వైసీపీ నేతల వ్యక్తిగత జీవితాలపై కూడా ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని స్పష్టం చేసింది. ఐటీడీపీకి అనుబంధంగా ఉన్న ఏ సోషల్ మీడియా ఖాతా నుంచైనా ఇలాంటి వ్యాఖ్యలు వస్తే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇతరులను కించపరిచేలా చేసే వ్యక్తిగత అభిప్రాయాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది.అటు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కూడా హుందాగా స్పందించింది. రాజకీయ నాయకుల వ్యక్తిగత జీవితాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందనేది ఆ ప్రకటన సారాంశం. "ఒక రాజకీయ నాయకుడి వ్యక్తిగత విషయానికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జరుగుతున్నట్లు గమనించాము. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం. కాబట్టి సంబంధిత వ్యక్తుల గోప్యతను గౌరవించాలి. బహిరంగ వేదికలపై మాట్లాడేటప్పుడు విచక్షణ పాటించాలి. ఈ విషయంలో పార్టీ నేతలు, ప్రతినిధులు, కేడర్, సోషల్ మీడియా కార్యకర్తలు కొన్ని సూచనలు పాటించాలి" అని ఆ ప్రకటనలో పేర్కొంది. సాధారణంగా రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు, ట్రోలింగ్స్ జరిగే ప్రస్తుత రాజకీయాల్లో పవన్ విషయంలో వైసీపీ, టీడీపీ తీసుకున్న ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో ఒక కొత్త, ఆరోగ్యకరమైన సంప్రదాయానికి తెరలేపినట్లుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత దాడులకు దూరంగా ఉంటూ, విధానపరమైన అంశాలపైనే దృష్టి సారించాలనే సందేశాన్ని ఈ పార్టీలు తమ కేడర్‌కు బలంగా పంపినట్లయింది.

ఏపీ వైపు మరో అల్పపీడనం.. దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 13న కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ఏర్పడిన 24 గంటల్లోనే మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా, ఆపై వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం

ఈ అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే భారీ వర్షాల కంటే ఎక్కువగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతుండటంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

తుపానుగా మారే అవకాశం తక్కువే

ప్రస్తుత సమాచారం ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ఇటీవలే వచ్చిన అర్నబ్, మురసు తుపానుల ప్రభావంతో రాష్ట్రంలో పంటలు, రహదారులు, విద్యుత్ స్తంభాలకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో అధికారులు తాజా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నారు. రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో మరిన్ని తుపానులు లేదా తీవ్ర అల్పపీడనాలు ఏర్పడే పరిస్థితులు లేకపోలేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మత్స్యకారులకు హెచ్చరికలు

తాజా అల్పపీడన పరిణామాలతో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో వాతావరణం అలజడిగా మారనుంది. సముద్రంలో అలల ఉద్ధృతి పెరగడంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నవంబర్ 14, 15 తేదీల్లో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని విపత్తు నిర్వహణ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణలో పెరుగుతున్న చలి

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. సోమవారం రాత్రి రాష్ట్రంలోని దాదాపు 16 జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 14.7 డిగ్రీల నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 14.7 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ అల్పపీడనం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నందున, దాని గమనం మరియు తీవ్రతలో మార్పులు జరిగే అవకాశం ఉంది. పరిస్థితిని బట్టి వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు తాజా బులెటిన్ల ద్వారా స్పష్టత ఇవ్వనుంది.

ఒకేచోట 86 వాహనాలు ఢీ.. 12 మంది మృతి!

- మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలోనే యాంబోల్ సమీపంలో ఒకే ప్రదేశంలో అటు, ఇటు ఉన్న రోడ్లపై దాదాపు 86 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇందులో చాలావరకు ట్రక్కులే ఉన్నాయి.

ఘటనా స్థలంలోనే 10 మంది మృతి చెందగా.. ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని మంత్రి కాట్యా ఇవ్మోవా వెల్లడించారు. మరో 46 మందిని చికిత్స కోసం తరలించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న ప్రధాని రుమెన్ రాదేవ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. ఇలాంటి భయానక దృశ్యాన్ని తాను ఎన్నడూ చూడలేదని ప్రాంతీయ గవర్నర్ మిహైల్ కాషెరోవ్ చెప్పారు. దట్టమైన పొగమంచు కారణంగా దారి సరిగ్గా కనిపించకపోవడం, రోడ్డు తడిగా ఉండటం వంటివి ప్రమాదానికి దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-2 సమగ్ర నోటిఫికేషన్

విడుదల.. పెరిగిన పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రంలో ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య పెరగడం విశేషం. గతంలో వెలువడిన సంక్షిప్త ప్రకటనలో 686 పోస్టులను పేర్కొనగా, తాజా నివేదికల ప్రకారం ఈ ఖాళీల సంఖ్య 720కి చేరింది. వీటిలో 471 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 249 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి.ఈ నోటిఫికేషన్‌లో కీలకమైన పలు కీలక శాఖల్లోని ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వీటిలో ప్రధానంగా 203 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, 176 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. అలాగే 91 సీనియర్ అకౌంటెంట్, 80 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులతో పాటు జూనియర్ అకౌంటెంట్, జీఎస్టీ ఆఫీసర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి ఇతర ముఖ్యమైన పోస్టులు కూడా ఉన్నాయి.

విద్యార్హతలు మరియు ఎంపిక విధానం:

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే కొన్ని నిర్దిష్ట పోస్టులకు ప్రత్యేక విద్యార్హతలు లేదా నిబంధనలు వర్తిస్తాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమ్స్) నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత పోస్టుల స్వభావాన్ని బట్టి కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ , చివరగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా తుది ఎంపిక పూర్తి చేస్తారు.

ముఖ్యమైన తేదీలు:

ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీగా 2026 డిసెంబర్ 11 రాత్రి 11:59 గంటల వరకు గడువు నిర్ణయించారు. అనంతరం అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను 2027 ఫిబ్రవరి 21న ఆఫ్‌లైన్ (పెన్ & పేపర్) పద్ధతిలో నిర్వహించనున్నట్లు సమాచారం. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. పోస్టుల వారీగా ఖాళీల వివరాలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, ఫీజు-స్కేల్స్, పరీక్షా సిలబస్ మరియు ఇతర పూర్తి మార్గదర్శకాల కోసం ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ (psc.ap.gov.in) లోని సమగ్ర నోటిఫికేషన్‌ను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

రిటైర్మెంట్ వరకు ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్ పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరోమారు పొడిగించింది. ఆయన పదవీ విరమణ తేదీ అయిన 2027 మార్చి 31 వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ ముగిసే వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం అధికారిక జీవో విడుదల చేసింది.గతంలో విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో 'అగ్ని' వెబ్ పోర్టల్ నిర్వహణలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు సంజయ్‌పై వచ్చాయి.

ధర్మవరం ఎంపీటీసీని అభినందించిన ముద్రగడ గిరిబాబు.



కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్,10:కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన ధర్మవరం ఎంపీటీసీ గొనగాని గంగా గోపాలకృష్ణ ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబుకు సాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇటీవల ధర్మవరం ఎంపీటీసీ-3 అభ్యర్థిగా ఘన విజయం సాధించిన గొనగాని గంగా గోపాలకృష్ణను గిరిబాబు ప్రత్యేకంగా శుభాకాంక్షలతోపాటు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇలాఖాలో కూటమి విజయదుందుభి



శ్రీమతి కూటి శేషారత్నం గారు
కాజులూరు మండలం జడ్పీటీసీ జనసేన



శ్రీమతి టేకుమూడీ సుజాత గారు
రామచంద్రపురం రూరల్ మండలం జడ్పీటీసీ, టీడీపీ



- మూడు మండలాల్లోనూ జడ్పీటీసీ స్థానాలు కూటమి కైవసం
- 58 ఎంపీటీసీ స్థానాలకు గాను 52 చోట్ల కూటమి హవా
- వైసీపీ ఐదు స్థానాలకే పరిమితం

కాజులూరు, పెన్‌పవర్, నవంబర్ 10:రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రాదేశిక ఎన్నికల ఫలితాలు కూటమికి ఘన విజయాన్ని కట్టబెట్టాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మూడు మండలాల ప్రజలు కూటమి అభ్యర్థులకే పట్టం కట్టి మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంపై తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం రూరల్ మండలాల్లో జడ్పీటీసీ స్థానాలన్నింటినీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవడంతో పాటు ఎంపీటీసీ స్థానాల్లోనూ భారీ ఆధిక్యంతో విజయకేతనం ఎగురవేశారు.నియోజకవర్గంలోని మూడు జడ్పీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీలతో విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాజులూరు మండలం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిని కూటి శేషారత్నం 9,989 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందగా, రామచంద్రపురం రూరల్ మండలం నుంచి టీడీపీ అభ్యర్థిని టేకుమూడి సుజాత 8,565 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కె.గంగవరం మండలం నుంచి టీడీపీ అభ్యర్థిని రవ్వా సీతామహాలక్ష్మి 7,317 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ మూడు విజయాలు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు నియోజకవర్గంలో ఉన్న రాజకీయ పట్టును మరోసారి చాటిచెప్పాయి.ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లోనూ కూటమి ప్రభంజనం కొనసాగింది. కాజులూరు మండలంలో మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు గాను కూటమి 18 స్థానాలను కైవసం చేసుకుంది. ఒక స్థానంలో వైసీపీ, మరో స్థానంలో స్వతంత్ర అభ్యర్థిని మోకన శిరీష విజయం సాధించారు. రామచంద్రపురం రూరల్ మండలంలో 20 స్థానాలకు గాను 18 స్థానాలను కూటమి గెలుచుకోగా, వైసీపీ రెండు స్థానాలకే పరిమితమైంది. కె.గంగవరం మండలంలో 18 ఎంపీటీసీ స్థానాలకు గాను కూటమి 16 స్థానాల్లో విజయం సాధించగా, వైసీపీ రెండు స్థానాలను దక్కించుకుంది.మూడు మండలాల పరిధిలో మొత్తం 58 ఎంపీటీసీ స్థానాలకు గాను కూటమి అభ్యర్థులు 52 స్థానాల్లో విజయం సాధించగా, వైసీపీ కేవలం ఐదు స్థానాలకే పరిమితమైంది. బంధనపూడి నుంచి స్వతంత్ర అభ్యర్థిని మోకన శిరీష విజయం సాధించారు. ఆమెకు కూటమి మద్దతు ఉండటంతో ఈ స్థానం కూడా కూటమి బలానికి అదనంగా నిలవనుంది.మొత్తంగా జడ్పీటీసీ స్థానాలన్నింటినీ గెలుచుకోవడంతో పాటు ఎంపీటీసీ స్థానాల్లోనూ అత్యధిక స్థానాలను దక్కించుకున్న కూటమి, రామచంద్రపురం నియోజకవర్గంలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ సమన్వయం, కూటమి పార్టీల ఐక్యత, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల కృషి ఈ విజయానికి ప్రధాన బలంగా నిలిచాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ ఫలితాలు నియోజకవర్గంలో కూటమి రాజకీయ బలాన్ని మరింత పెంచగా, మంత్రి సుభాష్‌కు తన ఇలాఖాలో ప్రజలు అందించిన విజయ కానుకగా రాజకీయ పరిశీలకులు అభివర్ణిస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయడానికి న్యాయవాదులు సహకరించాలి



రామచంద్రపురం, పెన్‌పవర్ నవంబర్ 10:వచ్చే నెల డిసెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ప్రతి న్యాయవాది సహకరించాలని రామచంద్రపురం 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి కోరారు. మంగళవారం జిల్లా కోర్టు హాలులో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.రాజీ చేసుకోవడానికి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి న్యాయవాదులు చొరవ చూపాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు కలిగే ప్రయోజనాలను వివరించి, ఇరువర్గాలను రాజీమార్గంలో నడిపించే బాధ్యతను న్యాయవాదులు తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాన్ని కక్షిదారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో న్యాయవాదుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వర రావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు, ట్రెజరర్ సాధే నారాయణరావు, మహిళా ప్రతినిధి కె.వి. సత్యవాణి, న్యాయవాదులు పలివెల సత్యనారాయణ, దొమ్ములపాటి సత్యనారాయణ, గాలింకి చిట్టిబాబు, పిల్లా పృథ్వి రామయ్య, కటకం అబ్బురామ్, పి. భరత్‌బాబు, పంపన విటల్, బొడ్డపాటి సురేష్‌కుమార్, ఎస్.బి.ఎస్. కుమారస్వామి, సూరంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫానుతో దెబ్బతిన్న వాకలపూడి-- రహదారికి తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేయాలి



కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కాకినాడ రూరల్, పెన్‌పవర్, నవంబర్ 10: అర్నబ్ తుఫాను ప్రభావంతో సముద్ర అలల ఉధృతికి తీవ్రంగా దెబ్బతిన్న వాకలపూడి--ఎదటం రాష్ట్ర రహదారి (ఎస్‌హెచ్--162)కు తాత్కాలిక మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని సుబ్బంపేట, కోనపాపపేట గ్రామాల వద్ద దెబ్బతిన్న రహదారి ప్రాంతాలను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు 46 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారి కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లోని పలు తీరప్రాంత మత్స్యకార గ్రామాలను జిల్లా కేంద్రంతో అనుసంధానిస్తుందని అధికారులు వివరించారు. తుఫాను సమయంలో సముద్ర అలల ధాటికి సుబ్బంపేట, కోనపాపపేట ప్రాంతాల్లో సుమారు 4 నుంచి 5 మీటర్ల లోతు వరకు రహదారి, కట్ట కొట్టుకుపోయినట్లు తెలిపారు. తాత్కాలిక పునరుద్ధరణ పనుల కోసం సుబ్బంపేట వద్ద రూ.1.95 కోట్లు, కోనపాపపేట వద్ద రెండు ప్రాంతాల్లో వరుసగా రూ.1.48 కోట్లు, రూ.1.98 కోట్లతో మొత్తం రూ.5.41 కోట్ల అంచనాలు రూపొందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రహదారి తీరప్రాంత మత్స్యకార గ్రామాల ప్రజలకు, ఆక్వా రైతులకు, అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఎంతో కీలకమైందన్నారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సముద్ర ఆటుపోట్లకు రహదారి తిరిగి కోతకు గురికాకుండా పటిష్టమైన రాతి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత పునరుద్ధరణకు అవసరమైన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పనులు పూర్తయ్యే వరకు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కాకినాడ, పెద్దాపురం డివిజన్ల ఆర్‌అండ్‌బీ కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిర్లంపూడి పోలీస్ స్టేషన్ లో హాజరైన మాజీ మంత్రి అంబటి రాంబాబు.



-స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడ అంత్యక్రియల సమయంలో అంబటిపై కేసు నమోదు.

-సుమారు గంటన్నరకు పైగా అంబటిని విచారించిన పోలీసులు.

-కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంది.

-మీడియా సమావేశంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు.



కిర్లంపూడి/పెన్ పవర్,నవంబర్,10: మాజీ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్ లో హాజరయ్యారు. స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో ముద్రగడ కుటుంబ సభ్యుల కోరిక గౌరవ వందనం తిరస్కరించడంతో అంబటి పై అప్పట్లో కిర్లంపూడి పోలీసులను కేసు నమోదు చేశారు. దీంతో అంబటి రాంబాబు మంగళవారం నేరుగా ముద్రగడ ఇంటికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ముద్రగడ సతీమణి పద్మావతి, కుమారుడు బాలు కుటుంబ సభ్యులను పలకరించారు.అనంతరం ముద్రగడ సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ముద్రగడ గిరిబాబుతో కలిసి పోలీస్ స్టేషన్ కు ర్యాలీగా వెళ్లేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలతో బయలుదేరారు.దీంతో ముద్రగడ ఇంటి బయట గేటు వద్ద పోలీసులు అడ్డుకుని ర్యాలీగా వెళ్లవద్దని పోలీసులు నిరాకరించడంతో గిరిబాబుతో కారులో బయలుదేరి వెళ్లి కిర్లంపూడి పోలీస్ స్టేషన్ లో హాజరయ్యారు. సుమారు గంటన్నరకు పైగా అంబటి రాంబాబును పోలీసులు విచారించారు. దీంతో బయట ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విచారణ అనంతరం అంబటి రాంబాబు పోలీస్ స్టేషన్ బయట విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రధాన ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ముద్రగడ కుటుంబ సభ్యుల కోరిక మేరకు స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడ అంత్యక్రియల సమయంలో పోలీసులు గౌరవ వందనం తిరస్కరించడం జరిగిందన్నారు.దీంతో తనపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పోలీసులు అసలైన నేరగాళ్లను,దొంగలను వదిలేసి కూటమి ప్రభుత్వం ఒత్తిడితో ప్రతిపక్ష నాయకులపై కేసులను నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం గొప్ప పోరాటయోధుడని, అన్ని వర్గాల కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేసిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎన్నో అవమానాలకు గురి చేయడమే కాకుండా, కుటుంబ సభ్యుల మీద పోలీసులు వ్యవహరించిన తీరు మరచిపోలేనిదన్నారు. దీక్ష భగ్నం చేసే సమయంలో మహిళలు అని చూడకుండా ముద్రగడ కుటుంబ సభ్యులను పోలీసుల అవమానించిన తీరు వల్లే పోలీసుల గౌరవ వందనం తిరస్కరించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా భయపడి వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు. తమకు న్యాయస్థానాలు, చట్టాలపై, అపారమైన గౌరవం ఉందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా న్యాయస్థానాల్లో పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు పెద్దాపురం నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, వైసీపీ నాయకులు బదిరెడ్డి గోవిందు,గౌతు స్వామి,పాఠంశెట్టి సూర్యచంద్ర ,ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం,గొల్లు దివాణం,గౌతు వాసు, గణేసుల లక్ష్మణ స్వామి అధిక సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా లెక్కల సేకరణలో వంద శాతం ఖచ్చితత్వం పాటించాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కాకినాడ, పెన్‌పవర్, నవంబర్ 10: జిల్లాలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, సేకరించే ప్రతి సమాచారం వంద శాతం ఖచ్చితత్వంతో ఉండేలా అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో భారత ప్రభుత్వ జనాభా లెక్కల డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జనాభా లెక్కలు--2027 రెండో దశ, జనాభా నమోదు కార్యక్రమంపై జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు డీఆర్వో డా.డి. తిప్పేనాయక్, హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ జాయింట్ డైరెక్టర్ జీవీ చంద్రకళ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించే జనాభా లెక్కల సేకరణ ఎన్నికలతో సమానమైన ప్రాధాన్యత కలిగిన బాధ్యత అని పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించే సిబ్బందికి ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని,మాతృభాష వంటి వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి సమగ్ర వివరాలు సేకరించాలని, కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోతే రెండు, మూడు పర్యాయాలు వెళ్లి వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. జనాభా లెక్కల ఆధారంగానే ప్రభుత్వ ఆర్థిక నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు,భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు రూపొందుతాయని తెలిపారు.ఫిబ్రవరి నెలలో జనాభా నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ జేడీ జీవీ చంద్రకళ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ దేశాభివృద్ధికి అత్యంత కీలకమని, ప్రతి పౌరుడి వివరాలు ఇందులో భాగం కావాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు,కాకినాడ జిల్లాకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వనరులు, నిధుల కేటాయింపుల్లో జనాభా గణాంకాలు కీలక ప్రాతిపదికగా నిలుస్తాయని వివరించారు. అర్హులైన ఒక్కరి పేరు కూడా నమోదు కాకుండా విడిచిపెట్టకూడదని,ఒకే వ్యక్తి పేరు రెండుసార్లు నమోదుకాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సీపీవో పి.త్రినాథ్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం,వివిధ స్థాయిల ఛార్జ్ అధికారులు, అసిస్టెంట్ ఛార్జ్ అధికారులు,సాంకేతిక సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఈ నెల 19న ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు

20న జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు

విజయవాడ/కాకినాడ, పెన్‌పవర్, నవంబర్ 10: రాష్ట్రవ్యాప్తంగా మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ నెల 19న రాష్ట్రంలోని 659 మండల పరిషత్‌లలో ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, 20న 28 జిల్లా పరిషత్‌లలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఈ నెల 14వ తేదీలోగా ప్రత్యేక సమావేశాల నోటీసులు అందజేయనున్నారు. ముందుగా ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోనున్నారు. వీరు మతపరమైన లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందినవారై ఉండాలి. అనంతరం ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని ఎంపీపీ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. అదేవిధంగా జెడ్పీటీసీ సభ్యులు తమలో ఒకరిని చైర్‌పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలు చేతులు పైకెత్తి ఓటు వేసే విధానంలో నిర్వహించనున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు జారీ చేసే విప్‌ను సభ్యులు తప్పనిసరిగా పాటించాలి. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలకు పార్టీ విప్ వర్తించదు. సంబంధిత పరిషత్‌లకు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సమావేశాలకు ఆహ్వానించినప్పటికీ వారికి ఓటు హక్కు ఉండదు. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 5న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్, 6న వాయిదా పడిన ప్రాంతాల్లో పోలింగ్, ఏడు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించగా, 7న ఓట్ల లెక్కింపు పూర్తిచేసి ఫలితాలను ప్రకటించిన విషయం తెలిసిందే. పరోక్ష ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ వెల్లడించారు.

వ్యాధులతో పోరాడే శక్తిని పెంచేవే టీకాలు: డాక్టర్ అడ్డాల సత్యనారాయణ



కాకినాడ, పెన్‌పవర్ నవంబర్ 10: శరీరంలోని రోగ నిరోధక శక్తిని పెంపొందించి, వ్యాధికారక క్రిములతో పోరాడేలా రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసేవే టీకాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ టీకాల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీకాలు వేయించడం ద్వారా శరీర రక్షణ వ్యవస్థ మరింత పటిష్టమై వ్యాధులను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. వ్యాధికారక క్రిములు శరీరంలోకి ప్రవేశించినప్పుడు వాటితో సమర్థంగా పోరాడేందుకు టీకాలు సహాయపడతాయని వివరించారు. ప్రతి ఒక్కరూ టీకాల ప్రాముఖ్యతను గుర్తించి, అవసరమైన టీకాలను నిర్ణీత సమయంలో వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

70వ రాష్ట్ర స్థాయి అండర్-19 తైక్వాండో పోటీలు ఘనంగా ప్రారంభం



పిఠాపురం, పెన్ పవర్, నవంబర్ 10 : పిఠాపురం పట్టణంలోని ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 70వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జిఎఫ్) అండర్-19 బాయ్స్ అండ్ గర్ల్స్ తైక్వాండో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.ఆర్.కె.రెడ్డి అధ్యక్షత వహించారు. తూర్పుగోదావరి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డిఐఈఓ) బి.మేరీ సుజాత ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా బాపట్ల జిల్లా నుంచి రాష్ట్ర పోటీలకు అబ్జర్వర్‌గా విచ్చేసిన వెంకట బుజ్జి, జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రెటరీ డాక్టర్ వెంకట్రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అత్యవసరం : డిఐఈఓ మేరీ సుజాత

ఈ సందర్భంగా డిఐఈఓ బి.మేరీ సుజాత మరియు ప్రిన్సిపల్ డి.ఆర్.కె.రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ విద్య ఆడపిల్లలకు ఆత్మరక్షణ పరంగా ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ వీటిని అభ్యసించాలని పిలుపునిచ్చారు.

జాతీయ స్థాయికి ఎంపిక

పిఠాపురం వేదికగా జరుగుతున్న ఈ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించే విజేతలను రాబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ పళ్ళ సురేష్, పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు, వివిధ జిల్లాల నుండి విచ్చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు మరియు క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న క్షేత్రంలో భక్తజన సందడి

ఏడు వారాల నోములు ముగించుకుని స్వామివారిని దర్శించుకున్న భక్తులు



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 10: కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోనసీమ తిరుమల వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం భక్తజన సందడి నెలకొంది. వేకువజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి పోటెత్తారు. స్వామివారి సన్నిధి భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది.ముఖ్యంగా ఏడు వారాల నోము దీక్షను భక్తిశ్రద్ధలతో ఆచరించి ముగించుకున్న భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ మొక్కుబడులను భక్తిపూర్వకంగా చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు, పూజా కార్యక్రమాలు, ఇతర సౌకర్యాల విషయంలో ఆలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఉప కమిషనర్ నల్లా సూర్య చక్రధర్ రావు తెలిపారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ సిబ్బంది సమన్వయంతో సేవలందించారు. ఏడు వారాల నోములు పూర్తి చేసుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడంతో వాడపల్లి వెంకన్న క్షేత్రం గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

శివన్నామ స్మరణతో మార్మోగిన దక్షిణకాశి



- పాదగయకు పోటెత్తిన భక్తులు
- పుష్కరిణిలో కార్తీక దీపాల శోభ

పిఠాపురం, పెన్ పవర్, నవంబర్ 10 : కార్తీక మాస ఆధ్యాత్మిక శోభతో 'దక్షిణకాశి'గా ప్రసిద్ధికెక్కిన పుణ్యక్షేత్రం పిఠాపురం శివనామస్మరణతో మార్మోగింది. త్రిలింగ క్షేత్రాల్లో ఒకటైన శ్రీ రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయానికి, పవిత్ర పాదగయ తీర్థానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీతో క్షేత్ర ప్రాంగణమంతా ఆధ్యాత్మిక ఉత్తేజంతో నిండిపోయింది.

పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు -- కార్తీక దీపాల శోభ

త్రిమూర్తుల స్వరూపంగా భావించే పాదగయ పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. కార్తీక మాస మహిమను పురస్కరించుకుని తమ పితృదేవతలకు ముక్తి కలగాలని కోరుకుంటూ భక్తిశ్రద్ధలతో పిండప్రదానాలు, తర్పణాలు అర్పించారు. సాయంసమయంలో పాదగయ పుష్కరిణి తీరం సువర్ణ కాంతులతో మెరిసిపోయింది. భక్తులు తమ కోరికలు నెరవేరాలని, కుటుంబంలో సుఖశాంతులు వర్ధిల్లాలని కోరుకుంటూ పుష్కరిణి నీటిలో కార్తీక దీపాలను వదిలారు. వేలాది ప్రమిదల వెలుగులు పుష్కరిణిలో ప్రతిబింబిస్తూ కన్నుల పండువగా నిలిచాయి.

స్వామివారికి విశేష అభిషేకాలు

ఆలయంలో శ్రీ కుక్కుటేశ్వర స్వామివారికి, పురూహూతీక అమ్మవారికి తెల్లవారుజాము నుంచే ఏకదాశ రుద్రాభిషేకాలు, సహస్ర నామార్చనలు మరియు మహాన్యాసపూర్వక అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. "హర హర మహాదేవ.. శంభో శంకర.." అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది.

భక్తులకు సేవలు -- అధికారుల విస్తృత ఏర్పాట్లు

సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది మరియు స్థానిక యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టారు. సాధారణ, దర్శన ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనాలు కల్పించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, పాలు అందజేశారు. పుష్కరిణి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఈతగాళ్లను, రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కార్తీక మాస విశిష్టత, పితృదేవతల రుణం తీర్చుకునే దివ్యక్షేత్రం కావడంతో పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తి తరంగాలతో పులకించిపోయింది.

కత్తితో దాడి చేసి దోపిడీ



ఇద్దరు నిందితులకు 10 ఏళ్ల 6 నెలల జైలు శిక్ష

పిఠాపురం, పెన్ పవర్, నవంబర్ 10 : ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి, ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు దోచుకున్న కేసులో ఇద్దరు నిందితులకు పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు 10 సంవత్సరాల 6 నెలల తీవ్ర జైలు శిక్ష విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి ఎం.బాబు (ఎ.జ. చీశీ. 179/2024) తీర్పు వెలువరించారు. 12 జూన్ 2023న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కైలాష్ భగ్ అలియాస్ సన్నీ (28), ఉత్తరప్రదేశ్‌కు చెందిన సునెల్ సాహు అలియాస్ బాలికరణ్ సాహు (45) ఆటోలో ప్రయాణికులుగా ఎక్కారు. మార్గమధ్యంలో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచారు. అనంతరం ఆటోలోని ఇతర ప్రయాణికులను బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు.బాధితురాలు అప్పికొండ మంగ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నాటి ఎస్ఐ అబ్దుల్ నబీ కేసు నమోదు చేయగా, సీఐ వై.ఆర్.కే.శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పర్యవేక్షణలో పోలీసులు పక్కా సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ బి.లక్ష్మణ దొర బలమైన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితులకు 10.6 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత సీఐ జి.వి.వి. సత్యనారాయణ, ఎస్ఐ షేక్ జాన్ భాషా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి.వి.వి.కిషోర్ కేసు విచారణను విజయవంతంగా సమన్వయం చేశారు. నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన దర్యాప్తు అధికారులు, లీగల్ టీమ్‌ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ర్యాలిలో దాసాంజనేయ స్వామికి ఘనంగా చాతుర్మాస పూజలు



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 10 కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలిసిన హరహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం దాసాంజనేయ స్వామికి చాతుర్మాస పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామ పూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పారాయణం వంటి విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో జరిగిన ఈ పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా, కోలాహలంగా సాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల వివరాలను ఆలయ అర్చకులు రఘు వెల్లడించారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమం తీరును చూసే కూటమికి ప్రజలు ఓటేశారు.

- ఎన్నికల్లో నీతి నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధత తో పనిచేశాం.
- ప్రత్యర్థి వర్గం మున్సిపల్ ఎన్నికలపై దుష్ప్రచారం మానాలి.

ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్10: మున్సిపల్ ఎన్నికల్లో ఏలేశ్వరం పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తీరును చూసే కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఓటేశారని పట్టణ కూటమి నాయకులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి నాయకుల అభినందన పరిచయ వేదిక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండున్నర ఏళ్ల పాటు చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటేశారు అన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు నిబద్ధత, నీతి నిజాయితీ, క్రమశిక్షణతో అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారన్నారు. టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ బొది రెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో గెలుకువటంలో సహజమని అన్నారు. ఓటమిని అంగీకరించలేక మేము ఎన్నికల్లో మోసం చేసి నెగ్గినట్లుగా ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కొంతమంది నాయకులు క్రాస్ ఓటింగుకు ప్రోత్సహించారి, అందువల్లే చైర్పర్సన్ మెజారిటీ తగ్గిందని



అన్నారు. కౌంటింగ్ బూతుల వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయని, అవసరమైతే రీ కౌంటింగ్ కోరవచ్చు కదా?! నిజాయితీగా జరిగిన ఎన్నికలపై దుష్ప్రచారం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ యార్లగడ్డ అక్షిత, బిజెపి నాయకుడు అలమండ మధుసూదన్ రావు, జనసేన నాయకుడు పలివెల వెంకటేష్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అవంతి ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతి కార్మికుడి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది.

- అవంతి ఫ్యాక్టరీలో కార్మికులకు ఆరోగ్య సేవలు.



ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 10: అవంతి ఫ్యాక్టరీలో పనిచేసే ప్రతి కార్మికుడికి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఫ్యాక్టరీ సీనియర్ మేనేజర్ బి శంకర్ అన్నారు. మండల పరిధి ఎర్రవరం గ్రామ పరిధిలో ఉన్న అవంతి సీ ఫుడ్ ఫ్యాక్టరీ లో కార్మికులకు వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు.జె. అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు బి జయరాం ఆధ్వర్యంలో వివిధ రకాలైన వైద్య పరీక్షలు కార్మికులకు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ సీనియర్ మేనేజర్ బి శంకర్,డిప్యూటీ మేనేజర్ ఆదివిష్ణు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా కార్మికులకు వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్యాక్టరీలో ప్రతి మంగళవారం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్యులు బి జయరాం మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఉన్న ప్రతి కార్మికులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పెద్దాపురం సబ్ యూనిట్ అధికారి ఎన్ వి సత్యనారాయణ మాట్లాడుతూ ఫ్యాక్టరీ పరిసరాల్లో నీటిని నిల్వలు లేకుండా చూసుకున్నట్లయితే కార్మికులకు ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎమ్ ఎల్ హెచ్ పిలు జి విజయశ్రీ, కే రజిని, ఏఎన్ఎంలు బి లక్ష్మీ, జి సూర్యకళ, హెల్త్ అసిస్టెంట్ డి రాజు, ఆశాలు టి రత్నవల్లి, కే అరుణ కుమారి, ఫ్యాక్టరీ సిబ్బంది, బిందు, ఫణీంద్ర, భవాని, ఎన్ రామలక్ష్మి, ఏ ఉష తదితరులు ఉన్నారు.

మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా.

-కిర్లంపూడి మండలం నూతన జడ్పీటిసి తోట రవి.



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్,10:మండల అభివృద్ధి ప్రజాసేవ లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కిర్లంపూడిమండలం నూతన జడ్పీటీసీ తోట రవి అన్నారు.కిర్లంపూడి జడ్పీటీసీగా అఖండ విజయం సాధించిన తోట రవి మంగళవారం జగ్గంపేట రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట శాసనసభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూను, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ తోట రవిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ తోట రవి మాట్లాడుతూ భారీ మెజారిటీతో గెలిపించిన కిర్లంపూడి మండల ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు పాదాభివందనాలు తెలియజేసారు.ఈ గెలుపు నా గెలుపు కాదు, ప్రజల గెలుపు, కూటమి పార్టీల గెలుపు అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో, సహకారంతో మండలంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందిస్తానని రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం, విద్య, వైద్యం అన్ని రంగాల్లో కిర్లంపూడి మండలాన్ని ముందు వరుసలో నిలబెడతానన్నారు కక్షలు, విభేదాలు లేకుండా అందరినీ కలుపుకుని ప్రతి పనిలో పారదర్శకత, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని. ప్రజల నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయను" అని హామీ ఇచ్చారు.

జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ మాట్లాడుతూకిర్లంపూడి ప్రజలు కూటమిపై చూపిన ప్రేమ, నమ్మకం అద్భుతం. తోట రవి అఖండ విజయం కూటమి పాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనంఅన్నారు. ఈ గెలుపును బాధ్యతగా తీసుకుని మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి అని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి అనియువతకు ఉపాధి, మహిళలకు భద్రత, రైతులకు చేయూత ఇవే మన లక్ష్యాలు అన్నారు జగ్గంపేట నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం అన్నారు. కిర్లంపూడి అభివృద్ధికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో అన్ని విధాలా అండగా ఉంటాం అన్నారు.ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, వీరవరం గ్రామ టిడిపి అధ్యక్షులు గొల్లపల్లి సూరిబాబు,గెడ్డం సురేష్,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తోట రవికి శుభాకాంక్షలు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పి.ఆర్. కళాశాల జట్ల ఘన విజయం



కాకినాడ, పెన్‌పవర్ నవంబర్ 10:అధికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషుల, మహిళల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పిఠాపురం రాజాస్ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) క్రీడాకారులు సత్తా చాటారు. పురుషుల, మహిళల రెండు విభాగాల్లోనూ టీమ్ ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకోవడంతో పాటు మొత్తం 13 పతకాలు సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి.కె. మెహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.వ్యక్తిగత విభాగంలో మహిళల నుంచి కె. తరంగిణి, పురుషుల నుంచి యశ్వంత్ గౌడ్ ఉత్తమ లిఫ్టర్లుగా (బెస్ట్ లిఫ్టర్స్) ఎంపికయ్యారు. అదేవిధంగా మహిళల విభాగం నుంచి ఇద్దరు, పురుషుల విభాగం నుంచి నలుగురు చొప్పున మొత్తం ఆరుగురు క్రీడాకారులు అధికవి నన్నయ్య విశ్వవిద్యాలయ జట్లకు ఎంపికయ్యారు. వీరు నవంబర్ 18 నుంచి చెన్నైలో జరగనున్న సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ పోటీలకు కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వి. సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సెలక్షన్ కమిటీ సభ్యులుగా రాజమండ్రి నుంచి వై. భాస్కరరావు, కాకినాడ నుంచి ఊహ సాయి, విశ్వవిద్యాలయ పరిశీలకులుగా డా. బాల సత్యనారాయణ పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి.కె. మెహర్ ప్రోత్సాహం, అధ్యాపకుల సహకారం, క్రీడాకారుల నిరంతర సాధనతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ డా. డి.వి. రమణ తెలిపారు. విజేత క్రీడాకారులను, ఉత్తమ లిఫ్టర్లను, విశ్వవిద్యాలయ జట్లకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది అభినందించారు. రానున్న సౌత్ ఇండియా పోటీల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆదిత్య విశ్వ విద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ లో ముగిసిన ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సు



గండేపల్లి, పెన్ పవర్, నవంబర్ 10గండేపల్లి మండలం, సూరంపాలెం లోని స్థానిక ఆదిత్య విశ్వ విద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'లీడర్షిప్ అండ్ టీం మేనేజ్మెంట్ ' నాయకత్వం మరియు బృంద నిర్వహణ అనే అంశం పైన ఆన్లైన్ శిక్షణ విజయవంతంగా, విజ్ఞానదాయకంగా ముగిసినట్లు విశ్వవిద్యాలయం ప్రో-వైస్ ఛాన్సలర్ (స్టాటజీ అండ్ పార్టనర్ షిప్), డా. రవి తంగజం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మరియు అధ్యాపకులకు నాయకత్వానికి పునాదులు, నాయకత్వ శైలులు, సమర్థవంతమైన బృందాలను నిర్మించడం మరియు నిర్వహించడం, బృందాలలు నిర్ణయాలు తీసుకోవడం మరియు నిర్ణయాలు తీసుకోవడం మరియు సమస్యను పరిష్కరించడం, బృందాలలో సమాచార మార్పిడి, ప్రేరణ మరియు విబేధాల నిర్వహణ మరియు డిజిటల్ మరియు కృత్రిమ మేధస్సు (ఏ ఐ) యుగంలో నాయకత్వం వంటి అంశాలపై తర్ఫీదు (శిక్షణ) తరగతులను నిర్వహించారని తెలిపారు. ఈ ఆన్లైన్ సర్టిఫికేషన్ కోర్సులు కు రిసోర్స్ పర్సన్ గా డా. కె. శైలజ రావు , డా.సి హెచ్ వాణి, ప్రొఫెసర్ ఎం. గీత, డా. పి. మనోజ్ బాబు, డా. కమీరా షైక్ మరియు ప్రొఫెసర్ కె. పార్థసాయిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి , ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్) డా. ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ఆదిత్య యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డా. సౌజన్య, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కో-ఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ డా. వి. వెంకటేశ్వరావు తో పాటు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతమే కీలకం



కాకినాడ, పెన్‌పవర్, నవంబర్ 10:రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు--2026 నిర్వహణలో అధికారులు పూర్తి అవగాహనతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్. మల్లిబాబు సూచించారు. మంగళవారం కాకినాడ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్టేజ్-× రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వి. రవికుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో స్టేజ్-× రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, చట్టపరమైన అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పాటించాల్సిన నియమ నిబంధనలు, చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలను వివరించారు.ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వంటివని, ఈ ఎన్నికల నిర్వహణలో స్టేజ్-× రిటర్నింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో ఏవైనా సందేహాలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆర్డీవో మల్లిబాబు కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత స్టేజ్-× రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐసీటీఈ -- అటల్ వాణి ప్రాయోజిత శిక్షణ కార్యక్రమంలో రెండవ రోజు శాస్త్రీయ ప్రసంగాలు



గండేపల్లి, పెన్ పవర్, నవంబర్ 10:ఆదిత్య యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ -- అటల్ వాణి పథకం ద్వారా నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం "కృత్రిమ మేధస్సు ఆధారిత అధునాతన నానో పదార్థాలలో తాజా ధోరణులు మరియు వాటి సుస్థిర అభివృద్ధి"లో భాగంగా రెండవ రోజు (10-11-2026) వివిధ శాస్త్రీయ అంశంపై నిపుణుల ప్రసంగాలు నిర్వహించారు. ఉదయం జరిగిన మొదటి సాంకేతిక సమావేశంలో ఐఐటీ తిరుపతికి చెందిన ప్రముఖ నిపుణులు లిడా. సోమశేఖర రావు"నానో పదార్థాలు మరియు వాటి అనువర్తనాలు"లి అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా నానో పదార్థాల తయారీ విధానాలు, వాటి ప్రత్యేక భౌతిక మరియు రసాయన లక్షణాలు, వైద్య, పారిశ్రామిక, వ్యవసాయ మరియు పర్యావరణ రంగాలలో వాటి వినియోగాల గురించి వివరించారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిశోధనల్లో నానో సాంకేతికత ప్రాధాన్యతను వివిధ ఉదాహరణలతో తెలియజేశారు. మధ్యాహ్నం జరిగిన రెండవ సాంకేతిక సమావేశంలో పుదుచ్చేరిలోని జాతీయ సాంకేతిక సంస్థ (ఎన్ఐటీ)కి చెందిన డా. ఎం.వి.ఏ. రాజు గారు "జీవ వైద్య పరికరాలలో నానో పదార్థాలు మరియు వాటి అనువర్తనాలు" అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా బయో సెన్సర్లు, వైద్య నిర్ధారణ పరికరాలు, వ్యాధుల గుర్తింపు మరియు ఆరోగ్య సంరక్షణ రంగాల్లో నానో పదార్థాల వినియోగం గురించి వివరించారు. నానో సాంకేతికత సహాయంతో అత్యంత సున్నితమైన, వేగవంతమైన మరియు సమర్థవంతమైన వైద్య నిర్ధారణ పరికరాల అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి విచ్చేసిన అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిపుణులతో ముఖాముఖి చర్చలు జరిపి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

తుఫాను అనంతరం పత్తి పంటపై రైతులు అప్రమత్తంగా ఉండాలి.

-కిర్లంపూడి మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి



కిర్లంపూడి,పెన్ పవర్, నవంబర్,10: వర్షాల వల్ల పత్తి పంటకు శిలీంధ్రాలు ఆశించి కాయ కుళ్లు తెగుళ్లు సోకే అవకాశం ఉందన్నారు. నివారణకు ఎకరాకు 600 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తుఫాను పంట నష్టానికి సంబంధించిన రైతుల జాబితాలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ, ఎన్ సీతారామమూర్తి, వీఏఏ సునీత, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్,10: తుఫాను అనంతరం పత్తి పంట పై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగం సుధామాధురి సూచించారు. మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగం సుధా మాధురి వరి, పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్నబ్ తుఫాను అనంతరం అధిక

చట్టబద్ధమైన దత్తత మాత్రమే అనుచరించాలి

జాతీయ దత్తత అవగాహన మాసోత్సవం - 2026



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 10 :తల్లిదండ్రులు కావడానికి అడ్డదారులు వద్దని, చట్టపరమైన దత్తత మాత్రమే మార్గమనే నినాదంతో ఈ సంవత్సరం నవంబర్ నెలను జాతీయ దత్తత అవగాహన మాసంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం– మిషన్ వాత్సల్య, మహిళా, శిశు అభివృద్ధి శాఖ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో కొంతమూరు , కాతేరు పిహెచ్సి లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.

ఈ కార్యక్రమంలోఎన్ఐసి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ జి. క్రాంతిలాల్ మాట్లాడుతూ దత్తత చట్టబద్ధమైన ప్రక్రియ. పిల్లలు లేని దంపతులు, ఒంటరి తల్లిదండ్రులు కేంద్ర దత్తత వనరుల సంస్థ ద్వారా మాత్రమే దత్తతకు దరఖాస్తు చేసుకోవా లన్నారు. మధ్యవర్తులను, దళారులను నమ్మవద్దని కోరారు. దత్తత పూర్తిగా చట్టబద్ధంగా, పారదర్శకంగా జరుగుతుంది. బిడ్డను కొనడం, అమ్మడం, బహుమతిగా ఇవ్వడం నేరం శిక్షార్హమైనదన్నారు. దత్తత తీసుకోవాలనుకునే వారు కారా పోర్టల్లో ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని ,అనాథ, అభాగ్య, వదిలివేయబడిన పిల్లలకు దత్తత ద్వారా శాశ్వత కుటుంబాన్ని అందించడమే లక్ష్యమన్నారు.దత్తతపై అపోహలు తొలగించి, సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందిం చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అక్రమ దత్తత జరగకుండా చూడాలని, చట్టభద్దమైన దత్తత కు ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. దత్తతకు సంబంధించిన మరిన్ని వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మిషన్ వాత్సల్య కార్యాల యాన్ని సంప్రదించగలరు లేదా చైల్డ్ హెల్ప్లైన్ – 1098 ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డా. నాగ దేవి మెడికల్ ఆఫీసర్, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎమ్ లు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల సమక్షం లో టీడీపీలో చేరిన వైసీపీ కేడర్



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 10 :కడియం మండలం వేమగిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. వేమగిరి తోట ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకులు జీఎస్ బ్రదర్స్ సుమారు 200 మంది అనుచరులతో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వేమగిరిలోని జిఎస్ బ్రదర్స్ ఇంటి వద్ద రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సమక్షంలో వీరంతా టీడీపీ కండువాలు కప్పుకున్నారు.వేమగిరి తోట ప్రాంతంలో వైసీపీకి అండగా నిలిచిన జీఎస్ బ్రదర్స్ తమ అనుచరులతో టీడీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు.ఇటీవల ప్రభుత్వం వేమగిరి గ్రామాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేసిన నేపథ్యంలో త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలకు ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ. తెలుగు దేశం పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు నాయకులు పార్టీలోకి రావడం సంతోషకర మన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వేమగిరి ప్రాంత అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని తెలిపారు. అనంతరం జిఎస్ బ్రదర్స్ గుబ్బల సత్యనారాయణ,నాగార్జున మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకత్వంపై నమ్మకంతో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నాయకత్వంలో పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు టీడీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ అనుచరులతో కలిసి కృషి చేస్తామని ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, సురపరెడ్డి జానకిరామ్, టీడీపీ నాయకులు పితాని శివరామకృష్ణ, వాసంశెట్టి బాలాజీ, వాసంశెట్టి నాగబాబు, యనమదల రాజు,జోగి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి. విజయ కుమార్



రాజమహేంద్రవరం, పెన్ పవర్,నవంబర్10 : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అటవీ శాఖ అమరవీరుల త్యాగాలు చిరస్మర ణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి. విజయ కుమార్ అన్నారు. రాష్ట్ర అమరవీరుల దినోత్సవం సందర్భంగా నగరం లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీలో మంగళవారం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. డైరెక్టర్ ఆధ్వర్యంలో అకాడమీ అధ్యాపకులు, సిబ్బంది, శిక్షణ అధికారులు అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా నవంబర్ 10న రాష్ట్ర అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి పి. శ్రీనివాస్ 1991 నవంబర్ 10న కర్ణాటకలో విధి నిర్వహణలో ఉండగా హత్యకు గురయ్యారనీ , ఆయన స్మృతికి గుర్తుగా ఈ రోజున అమరవీరులకు నివాళులర్పిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 23 మంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం వారు చేసిన త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. అమరవీరుల స్ఫూర్తితో అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు అంకితభావంతో పని చేయాలని డైరెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది భద్రత, వృత్తి నైపుణ్యం, అప్రమత్తతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. శిక్షణ పొందుతున్న అధికారులు అమరవీరుల ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకులు, సిబ్బంది, ట్రైనీ అధికారులు పాల్గొన్నారు.

రెండు తుపాన్లు.. వరదలు.. మరోవైపు ఎన్నికలు!

విపత్తు నిర్వహణతో పాటు ప్రజాస్వామ్య ప్రక్రియకు ఆటంకం లేకుండా సమర్థవంతమైన సేవలు

అర్నబ్, మురసు తుపాన్లు.. ఎర్రకాలువ వరదల సమయంలో పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం సమష్టి కృషి

విద్యుత్ పునరుద్ధరణ నుంచి బాధితులకు సహాయం వరకు.. ఎన్నికల నిర్వహణలోనూ అధికారుల సమన్వయం



పెన్ పవర్ -- భీమవరం, నవంబర్ 10:ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ.. ఇంకోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ.. ఇలా ఒకేసారి అనేక సవాళ్లు ఎదురైనా పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం సమష్టి కృషితో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంది. అర్నబ్, మురసు తుపాన్లతో పాటు ఎర్రకాలువ వరదల కారణంగా జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ, ప్రజలకు అత్యవసర సేవలు అందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విపత్తు నిర్వహణలో సమయస్ఫూర్తి, శాఖల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ జిల్లా యంత్రాంగం పనితీరుకు నిదర్శనంగా నిలిచాయి.

140 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో అర్నబ్ తుపాను

2026 అక్టోబర్ 27న పశ్చిమగోదావరి జిల్లాను అర్నబ్ తుపాను తీవ్రంగా ప్రభావితం చేసింది. గంటకు సుమారు 140 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో వీచిన ప్రచండ గాలులు, భారీ వర్షాలు జిల్లా ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేశాయి. విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం, భారీ వృక్షాలు నేలకూలడం, ఇళ్లు దెబ్బతినడం, రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడటం, సమాచార వ్యవస్థ స్తంభించిపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని మొత్తం 20 మండలాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి.

రంగంలోకి దిగిన జిల్లా యంత్రాంగం

తుపాను తీవ్రతను ఏమాత్రం లెక్కచేయకుండా జిల్లా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు. నేలకూలిన భారీ వృక్షాలను యుద్ధప్రాతిపదికన తొలగించి రహదారులపై రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి సంబంధిత శాఖల నుంచి నివేదికలు సేకరిస్తూ సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేశారు.

వారం రోజుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

అర్నబ్ తుపాను కారణంగా జిల్లాలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని సరఫరా నిలిచిపోయింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 2,000 మంది విద్యుత్ శాఖ సిబ్బందిని జిల్లాకు రప్పించారు. జిల్లావ్యాప్తంగా 226 బృందాలకు చెందిన 3,254 మంది అధికారులు, సిబ్బంది నిరంతరం పునరుద్ధరణ పనుల్లో పాల్గొన్నారు.విద్యుత్ స్తంభాలు, లైన్లు, సబ్స్టేషన్ల మరమ్మతులను రేయింబవళ్లు కొనసాగించి సుమారు వారం రోజుల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తుపాను కారణంగా విద్యుత్ రంగానికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.50.49 కోట్ల నష్టం వాటిల్లింది.విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లను ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ప్రజల నిత్యావసరాలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

బాధితులకు అండగా సహాయక శిబిరాలు

అర్నబ్ తుపాను కారణంగా జిల్లాలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ముందస్తు చర్యలు చేపట్టిన అధికారులు 4,088 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు అందించారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.పశువులకు పశుగ్రాసం అందించేందుకు ఇప్పటివరకు రూ.72 లక్షలు విడుదల చేయగా, అదనంగా మరో రూ.70 లక్షలు అవసరమని గుర్తించారు. తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు రూ.50 లక్షలు విడుదల చేయనున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్యం, సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పనుల కోసం రూ.1.95 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

అర్నబ్ నుంచి కోలుకోకముందే మురసు తుపాను.. ఎర్రకాలువ ఉద్ధృతి

అర్నబ్ తుపాను సృష్టించిన నష్టం నుంచి జిల్లా పూర్తిగా కోలుకోకముందే నవంబర్ 1 నుంచి మురసు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీనికి తోడు ఎర్రకాలువ వరద ఉద్ధృతి పెరగడంతో జిల్లాలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. మొత్తం 12 ప్రాంతాల్లో వరద ప్రభావం కనిపించింది. ముఖ్యంగా తాడేపల్లిగూడెం ప్రాంతంలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి.తణుకు మండలంలోని దువ్వ, కోనాల; పెంటపాడు మండలంలోని రామచంద్రపురం, మినవల్లేరు; తాడేపల్లిగూడెం మండలంలోని ఆరుళ్ల జగన్నాధపురం, నందమూరు, మరంపల్లి; ఉండి మండలంలోని యండగండి, పాములపర్రు; అత్తిలి మండలంలోని తిరుపతిపురం గ్రామాలతో పాటు భీమవరం పట్టణం వరద ప్రభావానికి గురయ్యాయి.

మురసు తుపాను సమయంలో 3,509 సహాయక శిబిరాలు, ఎర్రకాలువ వరద ప్రభావిత ప్రాంతాల్లో 3,255 సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు సహాయం అందించారు. వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు.

వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం

వరుస తుపాన్లు, వరదల ప్రభావంతో జిల్లాలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింది. అర్నబ్ తుపాను కారణంగా 1,99,554 ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. అనంతరం మురసు తుపాను, ఎర్రకాలువ వరదల కారణంగా మొత్తం 2,20,000 ఎకరాల ఆయకట్టు ప్రభావితమైంది.

పంట పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాల వివరాలను సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట నష్టాల అంచనా, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం మధ్యాహ్నం ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.

11,427 గృహాలకు నష్టం

వరుస ప్రకృతి వైపరీత్యాల కారణంగా జిల్లాలో నివాస గృహాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. అర్నబ్, మురసు తుపాన్లు, ఎర్రకాలువ వరదల ప్రభావంతో ఇప్పటివరకు మొత్తం 11,427 గృహాలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. క్షేత్రస్థాయి పరిశీలనల ద్వారా నష్టాల వివరాలను సేకరిస్తూ బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

విపత్తు నిర్వహణతో పాటు ఎన్నికల నిర్వహణ

ప్రకృతి వైపరీత్యాల కారణంగా జిల్లా యంత్రాంగం తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య ప్రక్రియకు ఆటంకం కలగకుండా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టడం మరో కీలక అంశంగా నిలిచింది.మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బంది నియామకం, పోలింగ్ సామగ్రి పంపిణీ, రవాణా, భద్రత, స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పోలీస్ శాఖ సమన్వయంతో రూట్ భద్రత, బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టారు. ఒకవైపు విపత్తు సహాయక చర్యలు కొనసాగిస్తూనే మరోవైపు ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించడం జిల్లా యంత్రాంగం సమన్వయ సామర్థ్యాన్ని చాటింది.

సమష్టి కృషితోనే సవాళ్లను అధిగమించారు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖలతో పాటు అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సమన్వయం చేస్తూ సహాయక చర్యలను ముందుకు నడిపించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ నిర్ణయాలు తీసుకోవడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించడం, ఇతర ప్రాంతాల నుంచి అదనపు సిబ్బందిని రప్పించడం వంటి చర్యలు విపత్తు నిర్వహణలో కీలకంగా నిలిచాయి.తుపాన్లు, వరదల వల్ల వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, విద్యుత్, రహదారులు తదితర రంగాలకు జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృందం పర్యటనకు అవసరమైన సమన్వయం, క్షేత్రస్థాయి వివరాల సేకరణను కూడా జిల్లా యంత్రాంగం చేపట్టింది.

ప్రజల భద్రతే ధ్యేయంగా.. నిరంతర ప్రజాసేవ

అర్నబ్, మురసు తుపాన్లు, ఎర్రకాలువ వరదలు ఒకేసారి అనేక సవాళ్లను విసిరినా పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం సమష్టి కృషి, సమర్థవంతమైన ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో పరిస్థితులను ఎదుర్కొంది. విద్యుత్ పునరుద్ధరణ నుంచి తాగునీటి సరఫరా వరకు, వరద బాధితులకు సహాయం నుంచి పంట నష్టాల అంచనా వరకు, పశువులకు పశుగ్రాసం అందించడం నుంచి పారిశుద్ధ్య నిర్వహణ వరకు అన్ని అంశాల్లో అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేశారు.మరోవైపు ఎన్నికల నిర్వహణ బాధ్యతలను కూడా సమన్వయంతో నిర్వర్తించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలవడం, అత్యవసర సేవలను నిరంతరం అందించడం, ప్రజాస్వామ్య ప్రక్రియకు ఆటంకం కలగకుండా చూడటం ద్వారా పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించింది.

25 ఏళ్ల తర్వాత ఆర్యవటానికి మళ్లీ ఎంపీపీ కిరీటం!

- **2001లో బొడ్డు విష్ణుమూర్తి.. 2026లో చందాల ఆదినారాయణ**
- **ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవలు**
- **పదవీ విరమణ తర్వాత రాజకీయ, సామాజిక సేవల్లో ప్రత్యేక గుర్తింపు**

కాజులూరు, పెన్‌పవర్, నవంబర్ 10:కాజులూరు మండల రాజకీయ చరిత్రలో ఆర్యవటం గ్రామానికి మరోసారి అరుదైన గుర్తింపు లభించింది. సుమారు 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అదే గ్రామానికి చెందిన నాయకుడు మండల పరిషత్ అధ్యక్ష పదవిని అధిరోహించనుండటంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. 2001లో తెలుగుదేశం పార్టీకి చెందిన బొడ్డు విష్ణుమూర్తి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టగా, 2026లో అదే గ్రామానికి చెందిన చందాల ఆదినారాయణ ఎంపీపీ పీఠాన్ని అధిరోహించడం విశేషంగా మారింది. దీంతో ఆర్యవటం గ్రామ రాజకీయ చరిత్రలో మరో అధ్యాయం నమోదైంది.

ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలోకి దిగిన చందాల ఆదినారాయణ త్రిముఖ పోటీలో భారీ మెజార్టీతో విజయం సాధించి తన రాజకీయ సత్తా చాటారు. అనంతరం ఎంపీపీ పదవికి ఎంపిక కావడంతో ఆర్యవటం గ్రామానికి రెండోసారి మండల పరిషత్ అధ్యక్ష పదవి దక్కినట్లయింది. 2001లో ఆర్యవటానికి చెందిన బొడ్డు విష్ణుమూర్తి ఉప్పుమిల్లి గ్రామం నుంచి ఎంపీటీసీగా ఎన్నికై ఎంపీపీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు అదే గ్రామానికి చెందిన ఆదినారాయణ ఎంపీటీసీగా ఎన్నికై ఎంపీపీ పీఠాన్ని అధిరోహించడంతో నాటి రాజకీయ చరిత్ర మరోసారి గుర్తుకొస్తోంది.చందాల ఆదినారాయణ విజయానికి ఆయన గతంలో చేసిన సేవలు, ప్రజలతో కొనసాగించిన సత్సంబంధాలు, అందరినీ కలుపుకొని వెళ్లే స్వభావం ప్రధాన బలంగా నిలిచాయని గ్రామంలో చర్చ జరుగుతోంది. ఉద్యోగ జీవితంలో ప్రభుత్వ సేవల ద్వారా ప్రజలకు సేవలందించిన ఆయన, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావుకు ఆర్యవటంలో నమ్మినబంటుగా గుర్తింపు పొందారు. పదవీ విరమణ అనంతరం కూడా విశ్రాంతికి పరిమితం కాకుండా పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ, గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సుమారు 12 ఏళ్లుగా రాజకీయ, సామాజిక సేవలను కొనసాగించారు. ఈ క్రమంలో ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం, కష్టసుఖాల్లో అండగా నిలిచే తత్వం ఆయనను ప్రజానాయకుడిగా తీర్చిదిద్దాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.పార్టీకి విధేయతతో పాటు వ్యక్తిగతంగా అందించిన సేవలు, అన్ని వర్గాల ప్రజలతో ఉన్న సాన్నిహిత్యం ఆయన విజయానికి దోహదపడ్డాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండటమే ఆదినారాయణకు ప్రజల్లో ప్రత్యేక ఆదరణ తీసుకొచ్చిందని చెబుతున్నారు.ఈ సందర్భంగా తన విజయానికి సహకరించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, సీనియర్ నాయకుడు సత్యంకు చందాల ఆదినారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, కాజులూరు మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. గతంలో తాను చేసిన సేవలే ప్రజల్లో తనకు ఆదరణను పెంచాయని పేర్కొన్నారు.మొత్తంగా 25 ఏళ్ల తర్వాత ఆర్యవటం గ్రామానికి మళ్లీ ఎంపీపీ పీఠం దక్కడం ఒకవైపు గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపగా, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజాసేవ ప్రారంభించి, పదవీ విరమణ అనంతరం రాజకీయ, సామాజిక సేవలతో ప్రజానాయకుడిగా ఎదిగిన చందాల ఆదినారాయణకు లభించిన గుర్తింపుగా స్థానికులు భావిస్తున్నారు.



బియ్యం ధరలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి



✸ డీ ఎస్ వో వి పార్వతి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబరు 10:రాష్ట్రంలో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించి, వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ దిశా నిర్దేశంలో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, వ్యాపారుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వి. పార్వతి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ బి. గణేష్ కుమార్ పాల్గొని బియ్యం ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. - బీపీటీ 3291 -- కిలో రూ.56- బీపీటీ 5204 -- కిలో రూ.56- కేఎన్ఎం -- కిలో రూ.66- హెచ్ఎంటీ -- కిలో రూ.76- ఆర్ఎన్ఆర్ -- కిలో రూ.76- జైశ్రీరామ్ -- కిలో రూ.82- ఎంటీయూ సాధారణ రకాలు -- కిలో రూ.47 ప్యాకింగ్ చేసిన బియ్యం సంచులపై ప్రభుత్వం నిర్ణయించిన ధరలను గరిష్ఠ చిల్లర విక్రయ ధర (ఎంఆర్‌పీ)గా తప్పనిసరిగా ముద్రించాలని సూచించారు. బియ్యానికి అనవసరంగా అధిక ధరలు నిర్ణయించడం, వినియోగదారుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు పౌర సరఫరాల శాఖ, తూనికలు-కొలతల శాఖ, విజిలెన్స్ శాఖల అధికారులు రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ కార్డు లేదా ఆధార్ నంబరు ఆధారంగా నెలకు 26 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 15 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు జరుగుతున్నాయని, రైతుబజార్లతో పాటు ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, సీతానగరం, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో ప్రత్యేక విక్రయ ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు. ప్రతి మండల కేంద్రంలోనూ ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 3,276 క్వింటాళ్ల బియ్యం విక్రయించగా, సుమారు 12,400 మంది వినియోగదారులు ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు.జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ బి. గణేష్ కుమార్ మాట్లాడుతూ, ధరణి బ్రాండ్ బియ్యం ప్యాకింగ్ కోసం జిల్లాలో ఇప్పటికే రెండు మిల్లులను ఎంపిక చేశామని, అదనంగా మరో రెండు మిల్లులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల రాజమహేంద్రవరం, కొవ్వూరు సహాయ సరఫరాల అధికారులు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ వార్డుల విభజనలో దళితులకు అన్యాయం



ఎస్సీ, బీసీ వార్డుల రిజర్వేషన్లలో తేడాలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 10 : స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల విభజనలో మాల, మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్, మహాజన సభ సోషలిస్టు పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4 నెలల క్రితం తమ వాదనల తో ఎస్సీ సామాజిక వర్గంలో 59 కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ను, నగరపాలక సంస్థ ఎన్నికల్లోను మాదిగల వాటా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కూటమి అభ్యర్థులకు మాలలు, మాదిగ లు ఎంత శాతం మేర ఓట్లు వేశారన్న ది పరిశీలించాలన్నారు. జడ్పిటిసి ఎన్నికలలో వైసీపీ మాదిగలకు ఒక సీటు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం 72 వార్డులకు పది స్థానాలు ఎస్ సి లకు కేటాయిస్తు న్నారని కనీసం 11 సీట్లు . ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ వార్డుల విభజన లో రిజర్వేషన్‌ల ప్రక్రియ శాస్త్రీయంగా జరగలేదన్నారు. ఎస్సీలు, బీసీలు అధికశాతంలో ఉన్న ప్రాంతాలలో వార్డుల విభజన అస్తవ్యస్తంగా జరగడం వల్ల ఎస్సీలు, బీసీలు అన్యాయానికి గురయ్యారని విమర్శించారు. ఎస్సీలకు కేటాయించిన 10 సీట్లలో ,4 మాదిగలకు , 4 మాలలకు 2 సీట్లు ఉపకులాలకు సీట్లు కేటాయించాలన్నారు. కార్పొరేషన్‌లో మాదిలగకు మేయర్ అవకాశం కల్పించాలని కోరారు. పార్టీల కార్యకర్తలకు మాత్రమే టికెట్‌లు కేటాయించాలని బయట వారికి సీట్లు కేటాయిస్తే సహించబోమని హెచ్చరించారు. వైసిపి మేయర్ టికెట్‌ను మాదిగలకు ఇచ్చిన గెలిపించడానికి సిద్ధమన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడా మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వైరాల అప్పారావు , తుత్తరపూడి రమణ మాదిగలు మాట్లాడుతూ గోరక్షణపేట లో ఎస్సీకి కేటాయిస్తే ప్రస్తుతం ఓసి మహిళకు కేటాయించారని, మాదిగ మహిళకు సీటు కేటాయించాలని కూటమి నాయకులను కోరారు. ఈ సమావేశంలో దొండపాటి కృష్టాఫర్ మాదిగ, మాజీ కార్పొరేటర్ కోరుమిల్లి రాజశేఖర్, అనపర్తి సురేంద్ర , తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ.. షెడ్యూల్ విడుదల



పెన్ పవర్ తాడేపల్లిగూడెం నవంబర్ 10:వెంకట్రామన్నగూడెం: తేనెటీగల పెంపకంపై ఔత్సాహికులకు శాస్త్రీయ పద్ధతుల్లో ఏడు రోజుల ఉచిత శిక్షణ అందించనున్నట్లు డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు తెలిపారు. వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి విడత నవంబర్ 16 నుంచి 22 వరకు, రెండో విడత డిసెంబర్ 14 నుంచి 20 వరకు, మూడో విడత ఫిబ్రవరి 1 నుంచి 13, 2027 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి విడతలో 25 మందికి శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తామని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు అందిస్తామని పేర్కొన్నారు. ఉద్యాన రైతులకు శిక్షణలో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. తేనెటీగల సంరక్షణ, పెంపకం, యాజమాన్య పద్ధతులు, తేనె, మైనం, పుప్పొడి సేకరణ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నారు. తేనెటీగల పెంపకానికి అవసరమైన 24 రకాల పరికరాలు, తేనెటీగల పెట్టెలను రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో నమోదు చేసుకోవాలని సూచించారు. సంప్రదించాల్సిన నంబర్లు: డా. సి.హెచ్. కిరణ్‌కుమార్ -- 7382633692 డా. కె. అర్చన -- 9502435151 జాతీయ తేనెటీగల పెంపక పథకం (ఎన్‌బీహెచ్ఎం), అటారీ జోన్-10 సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

21 మండల పరిషత్‌లు, ఒక జిల్లా పరిషత్‌లో పరోక్ష ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు జారీ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి



రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, నవంబర్ 10:తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 21 మండల ప్రజా పరిషత్‌లు, ఒక జిల్లా పరిషత్‌లో కో-ఆప్టెడ్ సభ్యులు, ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్లు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఎన్నికల షెడ్యూల్, పరోక్ష ఎన్నికల నిర్వహణ విధివిధానాలను వివరించారు. జిల్లాలో మొత్తం 412 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ), 21 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) సభ్యుల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు ఈ నెల 5వ తేదీన 20 మండలాల పరిధిలోని 394 ఎంపీటీసీ స్థానాలకు, 20 జెడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. గోపాలపురం మండలంలో వర్షాలు, రహదారి దెబ్బతినడం వంటి పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడిన 18 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానానికి నవంబర్ 6వ తేదీన పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఈ నెల 7వ తేదీన అన్ని స్థానాలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసి ఫలితాలను ప్రకటించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం ఈ నెల 19వ తేదీన జిల్లాలోని 21 మండల ప్రజా పరిషత్‌లలో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికతో పాటు ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 20వ తేదీన జిల్లా పరిషత్‌లో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు నిర్ణీత తేదీల్లో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తారని వివరించారు. ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారని, అదేవిధంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు తమలో ఒకరిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారని తెలిపారు. ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కో-ఆప్టెడ్ సభ్యులు మతపరమైన మైనారిటీ లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులై ఉండాలని, ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలకు ముందుగా కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికను నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు జరిగే ఎన్నికలను చేతులు పైకెత్తి ఓటు వేసే (రాష్ట్రశీఖ శీట ఝుఅఎం) విధానంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఎన్నికల సందర్భంగా సంబంధిత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సభ్యులకు జారీ చేసే పార్టీ విప్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికల విషయంలో పార్టీ విప్ వర్తించదని పేర్కొన్నారు. సంబంధిత మండల, జిల్లా పరిషత్‌లకు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు (ఎంపీలు), శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీలు), శాసనసభ సభ్యులు (ఎమ్మెల్యేలు) ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యేందుకు ఆహ్వానించబడతారని తెలిపారు. అయితే ఈ పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు వేసే హక్కు ఉండదని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. నిర్ణీత ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు, 20వ తేదీన నిర్వహించనున్న జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈ నెల 14వ తేదీలోగా అందజేయనున్నట్లు తెలిపారు. పరోక్ష ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమగ్ర మార్గదర్శకాలు, వివరణాత్మక విధివిధానాలను జారీ చేసిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్లు, మార్గదర్శకాలు, ఎన్నికల విధివిధానాలను పూర్తిస్థాయిలో అనుసరిస్తూ జిల్లాలోని 21 మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లో పరోక్ష ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు.

46, 47 వార్డులకు అభ్యర్థులను ప్రకటించిన మాజీ ఎంపీ మార్గాని



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 10 : రెండున్నరేళ్ల కూటమి పాలనలో నగరాభివృద్ధికి చేసిందేమీ లేదని , త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ ప్రజలకు పిలుపునిచ్చారు. వైసిపి ని గెలిపించి నగరాన్ని మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సహకరించాలని కోరారు. స్థానిక క్వారీ మార్కెట్ జంక్షన్‌లో దివంగత ముఖ్యమమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎన్నికల్లో పాత 46 వార్డు (కొత్త 66) నుంచి కళ్లి మురళీ కృష్ణ సతీమణి కళ్లీ కృష్ణవేణి, పాత 47 వార్డు (కొత్త 68) డివిజన్ నుంచి వైసిపి ఎస్సీ నాయకుడు తిరగటి దుర్గ సతీమణి తిరగటి సరస్వతి వైసిపి అభ్యర్థులుగా బరిలోకి దిగుతారని భరత్ రామ్ ప్రకటించారు. ఈ ప్రాంతం లోని మిగిలిన పాత 45, 48, 49 డివిజన్లకు చర్చించి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. నగరమంతా గోతుల మయం చేసేసారని, ప్రణాలిక లేకుండా ఇష్టమొచ్చినట్టుగా తవ్వరని ధ్వజమెత్తారు. ఇవిఎం ఎమ్మెల్యే చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను వైసిపి నిలదీస్తూనే ఉంటుంద న్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు, వైసిపి అజ్జరపు వాసు, మార్తి లక్ష్మి, గుడాల జాన్సన్, గారా చంటిబాబు, మదీనా భాషా, బిల్డర్ చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆయోడిన్ లోప రుగ్మతలపై అవగాహన



రాజమహేంద్రవరం , పెన్ పవర్ నవంబర్ 10 :విద్యార్థిని, విద్యార్థులు, స్థానిక ప్రజలు, మహిళలు అయోడిన్ లోపాలను నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన వైద్య సహాయం పొందాలని పట్టణ ఆరోగ్య కేంద్రం వాంబే కాలనీ డాక్టర్ అమృత సంజన స్పష్టం చేశారు. స్థానిక 16 వార్డు ఆవ వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నివారణ కార్యక్రమం పై మంగళవారం అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మువ్వల అమృత మాట్లాడుతూ, అయోడిన్ అయోడిన్ లోపం వలన గాయటర్ వ్యాధి వస్తుందని ఈ వ్యాధి నివారణకు అయోడిన్ ఉప్పు వాడాలని ఆమె సూచించారు. ఎన్ డి డి సి పి కార్యక్రమంలో భాగంగా స్థానిక తుమ్మగుంట ఆదర్శనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సత్యవేణి , పావని, ఆశా వర్కర్లు దేవి, అనుషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విజేతలో ప్రపంచ సైన్స్ దినోత్సవం



తాళ్లపూడి, పెన్ పవర్, నవంబర్ 10:ప్రతి విద్యార్థి విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు గురించి అవగాహన కలిగి వుండాలని, తద్వారా సైన్స్ ప్రాముఖ్యతను తెలుసుకుని జీవించాలని శ్రీ విజేత హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు డా జె వి ప్రమోద్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మంగళవారం ప్రపంచ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని స్కూల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. సైన్స్ ఆవిష్కరణలు విద్యార్థులకు పరిచయం చేస్తూ శాస్త్రవేత్తల చిత్ర పటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రకాలువ గండ్లపై నిపుణుల నజర్!



పెన్ పవర్ తాడేపల్లిగూడెం నవంబర్ 10:అప్పారావుపేట వద్ద క్షేత్రస్థాయి పరిశీలన.. రంగంలోకి ఎక్స్పర్ట్ కమిటీ తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట వద్ద ఎర్రకాలువ పరివాహక ప్రాంతంలో ఎక్స్పర్ట్ కమిటీ పర్యటించింది. ఎర్రకాలువకు ఏర్పడిన గండ్లను నిపుణుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కాలువ దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించింది. ఈ పర్యటనలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, గోదావరి డెల్టా వ్యవస్థ చీఫ్ ఇంజనీర్ చిన్నబాబు, విశ్రాంత ఈఎన్సీ సతీష్, ఎస్ఈ శ్రీనివాస్, డీఈ అప్పారావు పాల్గొన్నారు. ఎర్రకాలువ గండ్ల పరిశీలనలో భాగంగా నిపుణుల బృందం క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసింది. కాలువకు జరిగిన నష్టాన్ని పరిశీలించి సంబంధిత వివరాలను సేకరించింది.

న్యాయ సహాయంలో పారా లీగల్ వాలంటీర్ల పాత్ర కీలకం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనేద్ అహ్మద్ మౌలానా

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 10:సమాజంలో చట్టాలు, హక్కులపై సరైన అవగాహన లేక నిస్సహాయ స్థితిలో ఉన్న వివిధ వర్గాల ప్రజలకు న్యాయ సహాయాన్ని చేరవేయడంలో పారా లీగల్ వాలంటీర్ల పాత్ర కీలకమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనేద్ అహ్మద్ మౌలానా ఆన్నారు.మంగళవారం నగరం లోని జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పారా లీగల్ వాలంటీర్లకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థకు మధ్య పారా లీగల్ వాలంటీర్లు విశ్వసనీ యమైన వారధిగా నిలవాలని సూచించారు. క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, నిస్వార్థ సేవాభావంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీలక్ష్మి మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు తమ విధులను బాధ్యతాయుతంగా, నిర్వర్తించాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వాలంటీర్లకు కల్పించిన గుర్తింపు, అధికారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా అనధికారిక కార్యకలాపాల కోసం దుర్వినియోగం చేయకూడదని స్పష్టం చేశారు. సంస్థ నిర్దేశించిన నిబంధనలు, విధివిధానాలకు లోబడి బాధ్యతలు నిర్వహించాలని సూచించారు.సీనియర్ న్యాయవాది డాక్టర్ పి. త్రినాథరావు మాట్లాడుతూ సమాజంలోని ప్రజలకు ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాలు, ప్రాథమిక హక్కులపై సరైన అవగాహన లేదన్నారు. పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు సమస్యలను గుర్తించి, తగిన న్యాయ సహాయం అందేలా కృషి చేయాలని సూచించారు.సీనియర్ న్యాయవాది డాక్టర్ పి. త్రినాథరావు తెలుగులో రచించిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం--2006 ప్రశ్నలు -- వివరణ" అనే పుస్తకాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనేద్ అహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. శిక్షణ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, విధివిధానాలు, వారి అధికార పరిధి, ప్రజలకు న్యాయ సహాయం అందించే విధానం తదితర అంశాలపై సీనియర్ న్యాయవాది డాక్టర్ పి. త్రినాథరావు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అధికారుల మధ్య సమన్వయంతోనే మెరుగైన సేవలు



- తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, నవంబర్ 10:గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని నిరంతరం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) సహాయ ఇంజినీర్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమష్టి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.వి. గిరితో కలిసి జిల్లాలో ఆ శాఖ చేపడుతున్న పనులపై డీఈలు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను ఏఈలు నిరంతరం పర్యవేక్షించాలని, కేవలం మంజూరైన పనులకే పరిమితం కాకుండా మొత్తం తాగునీటి నిర్వహణపై బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లోని నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని, క్లోరినేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. డ్రైనేజీ లీకేజీలు, పైప్‌లైన్ సమస్యల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనుల్లో నిలిచిపోయిన వాటిని గుర్తించి, కాంట్రాక్టర్లతో మాట్లాడి రానున్న నెల రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా తాగునీటి సరఫరా, శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర వసతుల కల్పనపై ఎంపీడీవోలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పరిపాలనాపరమైన, నిధులపరమైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, విధుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలాల వారీగా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రాధాన్యతా రంగాలపై సమగ్ర డీపీఆర్‌లు సిద్ధం చేయాలి: కలెక్టర్ కె. దినేష్ కుమార్



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో)పెన్ పవర్ నవంబర్ 10:పోలవరం జిల్లా సమగ్ర అభివృద్ధికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సహకారంతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను సమర్థవంతంగా వినియోగించుకునేలా సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రాధాన్యతా రంగాలను గుర్తించి అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.మంగళవారం సాయంత్రం రంపచోడవరం కలెక్టరేట్‌లోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సీఎస్ఆర్ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల సమీకరణ, ప్రాజెక్టు నివేదికల రూపకల్పనపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఖణజూ, డెక్కన్ కెమికల్స్, ఏపీ ట్రాన్స్‌కో, హెచ్‌డీఎఫ్‌సీ ఫౌండేషన్, కోటక్ ఫౌండేషన్, ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ తదితర సంస్థల సీఎస్ఆర్ నిధులతో చేపట్టగల కార్యక్రమాలపై చర్చించారు.ముఖ్యంగా ఆరోగ్యం, పోషకాహారం, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, క్రీడా సముదాయాల ఏర్పాటు, విద్య, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీతి ఆయోగ్ ద్వారా గంగవరం మండలానికి రూ.కోటి, మారేడుమిల్లి మండలానికి రూ.21.5 కోట్ల అవార్డు నిధుల కోసం అవసరమైన డీపీఆర్‌లను వారంలోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. నీతి ఆయోగ్ సహకారంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, థీమ్ పార్క్ లేదా ఎక్స్‌పీరియన్స్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. జీవనోపాధి, ఆరోగ్యం, పోషకాహారం, విద్యా రంగాల్లో రూ. 2 కోట్ల వ్యయంతో రెండు వినూత్న కార్యక్రమాలను రూపొందించాలన్నారు.జిల్లాలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, జాఫ్రా, రబ్బరు పరిశ్రమల అభివృద్ధిపై సమగ్ర అధ్యయనం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్, ఉపాధి అవకాశాలపై కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో నిర్వహిస్తున్న ణూచీచీజుశ వస్త్ర పరిశ్రమను అధ్యయనం చేసి, పోలవరం జిల్లాలోనూ ఇటువంటి పరిశ్రమ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.అలాగే 'గవర్నెన్స్ ఆన్ వీల్స్', 'మా ఊరి మైదానం' వంటి కార్యక్రమాల అమలుకు సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అధికారులు తమకు కేటాయించిన అంశాలపై బాధ్యతాయుతంగా పనిచేస్తూ, నిర్దేశించిన గడువులోగా నాణ్యమైన డీపీఆర్‌లు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కమ్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ముఖ్య ప్రణాళిక అధికారి, వై. రామవరం ఆశయ బ్లాక్ ఫెలో కె. లవన్ రెడ్డి, గంగవరం ఆశయ బ్లాక్ ఫెలో ఎల్. హేమ మాధురి, మారేడుమిల్లి ఆశయ బ్లాక్ ఫెలో ఆర్. కృష్ణ, సీవీఏపీయూ బృంద సభ్యురాలు మధుర దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు జారీ

- ఈ నెల 19న ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు.. 20న జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు
- 12 మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలకు ఏర్పాట్లు



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 10:పోలవరం జిల్లాలో మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 19న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, 20న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 101 ఎంపీటీసీ, 12 జెడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 5న పోలింగ్ నిర్వహించగా, 7వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 12 మండల పరిషత్‌లు, ఒక జిల్లా పరిషత్‌లో కో-ఆప్టెడ్ సభ్యులతో పాటు అధ్యక్ష, ఉపాధ్యక్ష, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్లు జారీ చేసిందన్నారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న మండల పరిషత్‌లలో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక అనంతరం ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. 20న జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు జరుగుతాయి. ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోనున్నారు. వీరు మతపరమైన లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులై ఉండాలి.

ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని ఎంపీపీ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారని, జెడ్పీటీసీ సభ్యులు తమలో ఒకరిని చైర్‌పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారని కలెక్టర్ వివరించారు. ఈ ఎన్నికలను చేతులు పైకెత్తి ఓటు వేసే (షో ఆఫ్ హ్యాండ్స్) విధానంలో నిర్వహిస్తారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సభ్యులకు జారీ చేసే విప్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలకు పార్టీ విప్ వర్తించదని స్పష్టం చేశారు.సంబంధిత పరిషత్‌లకు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను ప్రత్యేక సమావేశాలకు ఆహ్వానిస్తారని, అయితే ఈ పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు హక్కు ఉండదన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈ నెల 14వ తేదీలోగా అందజేస్తామని తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు.

మండలానికి చేరిన పంచాయతీ ఎన్నికల సామాగ్రి



వై రామవరం, పెన్ పవర్,నవంబర్ 10 : మండలంలో జరగనున్న పంచాయితీ ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి మండలానికి చేరిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. మండలంలో 12 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు, 102 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్ లు, ఫామ్స్,సీలు పరిశీలించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వారిగా విభజించడం జరుగుతుందన్నారు ఎన్నికల ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు .

ఇసుక అక్రమ రవాణాపై నిఘా మరింత కట్టుదిట్టం చేయాలి

సరిహద్దు రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు.. ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డుల నిర్వహణకు చర్యలు



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో)పెన్ పవర్ నవంబర్ 10 :పోలవరం జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ (ణూరాజ) చైర్మన్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వ, విక్రయాల నిర్వహణతో పాటు అక్రమ రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు.జిల్లా సరిహద్దుల నుంచి పొరుగు రాష్ట్రాలకు అనుసంధానమయ్యే రహదారుల ద్వారా ఇసుక అక్రమంగా తరలించే అవకాశాలు ఉన్నందున పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో అవసరమైన ప్రదేశాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని పరస్పరం అనుసంధానం చేసి నిరంతరం పర్యవేక్షించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే గుమ్మలయ్యగూడెం ఇసుక రీచ్, గుండాల స్టాక్ యార్డులను కార్యకలాపాలకు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన తవ్వకం, లోడింగ్ ఏజెన్సీలను గుర్తించాలని జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారిని ఆదేశించారు. ఈ ప్రక్రియలో చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సహకారం అందించాలని తెలిపారు. అవసరమైన అనుమతులు, ఇతర ఏర్పాట్లు పూర్తి చేసి ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డులను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇసుక సరఫరా సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు అక్రమ తవ్వకాలు, అక్రమ నిల్వలు, అనధికార రవాణాకు అవకాశం లేకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్లు డి. పృథ్వీరాజ్ కుమార్, సీహెచ్. నరేంద్ర పడాల్, పోలవరం జిల్లా ఇన్‌చార్జి మైన్స్ ఏడీ జి. కృష్ణమూర్తి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అమర వీరుడు పందిళ్ళపల్లి శ్రీనివాస్ కు ఘన నివాళి గోకవరంలో వర్ధంతి సభ, ర్యాలీ



గోకవరం నవంబర్ 10:-కీర్తి చక్ర గ్రహీత, అమర వీరుడు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి పందిళ్ళపల్లి శ్రీనివాస్ 35వ వర్ధంతిని మంగళవారం గోకవరం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఇందుకూరు రేంజ్ కార్యాలయంలో అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి కె. కొండలరావు ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా పందిళ్ళపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో అటవీశాఖ సిబ్బంది,స్థానిక ప్రజలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమర వీరుడు శ్రీనివాస్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ అటవీశాఖ కార్యాలయం నుండి పాత బస్టాండ్ పోలీస్ స్టేషన్ ఆంజనేయస్వామి గుడి సెంటర్ మీదుగా రామా వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రేంజ్ అధికారి కె కొండలరావు గారు మాట్లాడుతూ పందిళ్ళపల్లి శ్రీనివాస్ అడవి కోసం పుట్టి, అడవి కోసమే ప్రాణాలర్పించారు. వీరప్పన్ లాంటి క్రూరుడిని కూడా లొంగదీసుకోవాలని నిరాయుధుడిగా వెళ్ళిన ధీరుడు. ఆయన త్యాగం ఎప్పటికీ మరువలేనిది. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ ఇందుకూరు సెక్షన్ ఆఫీసర్ రామకోటి మరియు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరీ పందిళ్ళపల్లి శ్రీనివాస్.....?

పందిళ్ళపల్లి శ్రీనివాస్ 1954 సెప్టెంబర్ 12న రాజమహేంద్రవరంలో జన్మించారు. జాంపేట సెంటర్ లో చర్చికి దక్షిణం వైపు ఉన్న చెక్క కటాకటలు బంగాళాపెంకుల ఇల్లే ఆయన స్వగృహం. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఎమ్మెస్సీలో బంగారు పతకం సాధించి,1979లో ఐఎఫ్ఎస్ కు ఎంపికయ్యారు.కర్ణాటక కేడర్ అధికారిగా చామరాజ్ నగర్ లో పనిచేస్తూ,వీరప్పన్ ఆట కట్టించడానికి ప్రయత్నించారు.కర్ణాటక రాష్ట్రంలోని గోపీనాథం గ్రామం లో రోడ్లు,మంచినీరు,ఇళ్ళు,గుడి కట్టించి గ్రామస్తుల మనసు గెలుచుకున్నారు.వీరప్పన్ లొంగిపోతానని చెప్పడంతో 1991 నవంబర్ 9 న నిరాయుధుడిగా బయలుదేరారు.1991 నవంబర్ 10 న వీరప్పన్ ముఠా ఆయనను దారుణంగా హత్య చేసింది. ఆయన త్యాగానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 1992 జనవరి 26న ఆయనకు కీర్తి చక్ర అవార్డును ప్రకటించింది.దేశం కోసం ప్రాణాలర్పించిన ఆయన తల్లిగారు ఆ అవార్డును అందుకున్నారు.

ప్రత్యేక కథనం సేకరణ:-

బత్తిన రామకృష్ణ పెన్ పవర్ పత్రికా రిపోర్టర్.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com